ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

మే 2, 2010

కథా నిలయం
Entered
శ్రీకాకుళం

మీ నవ్వే.. మీకు టానిక్...

హ్యాపీబర్త్‌డే

2010 మే 2 నుంచి
2010 మే 8 వరకు

ఎం.డి. అమీర్‌ఖాన్
మే-2008
ఆసియా-అజిస్
చౌదర్‌పల్లి-రంగారెడ్డి

పి.కార్తీక్
1సం॥, మే-8
శశికళ-నాగేశ్వర్
జియాగూడ-హైదరాబాద్

కోవిద్
3సం॥, మే-4
సుజాత-సురేష్‌కుమార్
ముస్తఫానగర్-ఖమ్మం

ఉమైర్ అజీజ్
1సం॥, మే-5
ఫౌజియాబేగం-రఫియోద్దీన్
కిషన్‌బాగ్-హైదరాబాద్

డి. వర్షిణి
మే-7
నిర్మల-శ్రీనివాసరావు
తిరువూరు-కృష్ణా

ఆధునిక
మే-3
లక్ష్మీశ్యామలాదేవి-ప్రేమ్‌కుమార్
విజయవాడ

కె. సాయి చైతన్య
మే-6
అరుణ-కుప్పరాజు
విజయపురం-చిత్తూరు



మహీధర రాజు
1సం॥, మే-2009
నర్సమ్మ-వెంకటనర్సరాజు
రొంపిచర్ల-గుంటూరు

ENTERED

మనలో మాట

ఏం చేయను.... ఖాళీనే...

మన దేశంలో జనాభాను పదేళ్లకోమారు లెక్కబెడతారు. సరిగ్గా దశాబ్దం కిందట లెక్కించారు. అధికారులు మళ్లీ ఇప్పుడు బయలుదేరారు పుస్తకాలూ పెన్నులూ పుచ్చుకొని. ఇంటింటికి తిరిగి కుటుంబ యజమాని ఎవరు? ఇంట్లో ఎంత మంది వుంటారు? ఆడవాళ్లెందరు? మగవాళ్లెందరు? పిల్లాజెల్లా ఎందరు? ఏం చదువుకున్నారు? వాళ్ల వయసు, ఆదాయమెంత? వంటి వివరాలన్నీ ఎక్కించేసుకొని వెళుతుంటారు.

సరిగ్గా ఈ సమయంలోనే ఓ తమాషా జరుగుతుంది. ఇంట్లో మహిళలను ఏం చేస్తుంటావమ్మా? అనడుగుతారు సహజంగానే. ఉద్యోగాలు చేసుకునేవారు అదే చెప్పేస్తారు. అలా కాని వాళ్లతోనే ఇబ్బందంతా.

"ఏం లేదండి. ఖాళీనే. ఇంట్లోనే వుంటానండి" అనేస్తారు ముసిముసి నవ్వులు నవ్వుతూ. మగవాళ్లు కూడా ఓ వైపు హాయిగా అన్ని పనులు చేయించుకుంటూనే వుంటారు. మరోవైపు తమ ఆడాళ్లు ఏమీ చేయరని చెప్పేస్తుంటారు.

జనగణన అధికారులు కూడా ముత్యాల్లాంటి అక్షరాలతో 'గృహిణి' అని రాసేసుకుని వెళ్లిపోతారు.

తర్వాత అధికారులు నింపిన ఫారాలు చూస్తే ఆ మహిళలంతా ఖాళీగానే వుంటారు. ఏమీ చేయరు కామోసు అనిపిస్తుందెవరికైనా.

కానీ... ఇంట్లో అంట్లు తోమేదీ, బట్టలుతికేదీ, వంట చేసేదీ, ఇల్లు చక్కబెట్టేదీ ఎవరు? పిల్లల్ని పెంచిపెద్ద చేసేది ఎవరు? కోళ్లు పెంచేది...పాడి చేసేది...ఎవరు? మైళ్లకు మైళ్లు నడిచి కట్టెలు, మంచినీళ్లు తెచ్చేదెవరు?

ఇంకెవరు! ఆ ఖాళీగా వున్నామని చెప్పేవాళ్లే !!

కాకపోతే వాళ్లు చేసేదాన్ని పనిగా చెప్పుకోరు. చెప్పుకోవడం సంగతి అటుంచి పనిగా కూడా భావించరు. వాళ్లే కాదు. వాళ్ల చుట్టూ వున్న వారు కూడా అంతే. అది ఆడాళ్ల పనేకదా అన్నట్టు చూస్తారు. చెప్తారు. దాంతో మహిళల మెదళ్లలో కూడా అది పనే కాదన్న ముద్ర అలా నాటుకుపోయింది.

ఇవేకాదు ఇళ్లల్లో విస్తరాకులు, పచ్చళ్లు, అగర్బత్తీలు, బీడీలు చేసే మహిళలు కూడా ఆ పని చేస్తున్నామని చెప్పుకోరు. అందుకే కామోసు ప్రభుత్వ లెక్కల్లో వారి శ్రమ నిజంగా చేసేదానికంటే తక్కువగా నమోదౌతుంటుంది. కుప్పంలో పదిహేను వేల మంది మహిళలు అగర్బత్తీలు తయారు చేస్తున్నా... గవర్నమెంటు లెక్కల్లో కేవలం మూడు వేల మందే వున్నారు. నర్సాపూర్ పరిసరాల్లో యాభై వేల మంది మహిళలు లేసులు అల్లుతుంటే ప్రభుత్వ అంకెల్లో 2 వేల మందే వున్నారు.

ఇలాంటి మహిళలు తర్వాతర్వాత ఏదైనా పనిలో చేరబోతే మరో తమాషా జరుగుతుంది. "ఊ...మీరు ఇప్పటివరకు పేడ పిసుక్కుని పిడకలు చేసినవారే కదా. పైసా ఆదాయం లేకుండా ఖాళీగా ఇంట్లో పడున్నవారేకదా. మేమిచ్చే రెండు మూడొందలకు చేస్తే చేయండి. లేకపోతే లేదు" అనేస్తారు.

రూపాయి రెండు రూపాయలకూడా భర్త ముందు చెయ్యి చాచే దానికంటే ఇదేనయమనుకొని చేరిపోతారు. ఇదో విచిత్రవిషాదం.

ఈ జనగణన సందర్భంగానైనా ప్రభుత్వం మహిళలు చేసే శ్రమను గుర్తించి... రికార్డు చేయాలి. ఆడవాళ్లు కూడా తాము చేసే పనిని ప్రభుత్వ లెక్కల్లో నమోదయ్యేలా చూసుకోవాలి. లేకపోతే ఎప్పటికీ వారి కష్టం కాగితాలకెక్కదు. గుర్తింపుకు నోచుకోదు.

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	6
విజ్ఞాన వీచిక	....	7
సీరియల్	...	8
న్యాయ సలహాలు	...	10
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
చల్లచల్లగా	...	17
రుచి	...	20
వికాసం	...	21
బాలనేస్తాలు	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

శ్రీశ్రీ మహాప్రస్థానం అనంతం

సినిమా కబుర్లు ... 11

రిస్క్ అంటే భయం

కథ ... 18

నారదుడు



'అక్షర నక్షత్రాలు' ఆసక్తికరం

'అక్షర నక్షత్రాలు' వ్యాసం చాలా ఆసక్తికరంగా వుంది. ఐతే ఈ పుస్తకాలు అమ్మే స్టాల్స్ నగరాలకే పరిమితం అయ్యాయి. ఇంగ్లాండ్‌లో 'హే ఆన్ వై' అనే గ్రామం వుంది. ఆ గ్రామమంతా పుస్తకాల షాపులే. పాత పుస్తకాలు, రిమైండర్ పుస్తకాలు ఎక్కడ దొరికినా దొరకకపోయినా అక్కడ దొరుకుతాయి. ఆ ప్రాంతం పుస్తక ప్రియులకు ఒక టూరిస్టు ప్రాంతంగా తయారైంది. ఆ గ్రామానికి ఎవరు వెళ్లి ఫలానా పుస్తకం కావాలని అడిగినా వెంటనే కంప్యూటర్లో చూసి ఇస్తారు. ఆ గ్రామంలోనే కొన్ని పుస్తక షాపుల్లో అమ్మేవాళ్లే వుండరు. కావలసిన పుస్తకం ఏరుకుని అక్కడున్న బాక్సులో డబ్బులు వేయాలి. పాత పుస్తకాల కోసం మన రాష్ట్రంలో కూడా అద్దెలు తక్కువగా వుండే గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అవసరం. కొత్త పుస్తకాలకే కాక పాత పుస్తకాలకు కూడా ఎంతో విలువ వుంది. అలాంటి పుస్తకాలు లభించే అవకాశాలు మన దేశంలో కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ఆర్.పద్మ, గాంధీ బొమ్మ దగ్గర, విజయవాడ.

సర్వాంశ శోభితం

ఏప్రిల్ 18 ఆదివారం అనుబంధం అన్ని వర్గాల వారినీ అలరించే సర్వాంశశోభిత ప్రబంధమనే చెప్పాలి. ప్రతి ఒక్క అంశం ఉపయోగకరంగా వుండి అన్ని వయసుల వారినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఈ వారం 'రుచి' శీర్షికలో అందించిన వివిధ రకాల పచ్చళ్లు మా ఇంటిల్లిపాదినీ నోరూరింపచేశాయి. వీటిలో బీరతొక్కుతో పచ్చడి, చింతచిగురుతో పచ్చడి మరీ మరీ చవులూరించాయి. 'చూద్దామా' అంటూ చూపిన ఇస్తాంబుల్ అందచందాలు కనులకింపుగా ఎంతో అకర్షణీయంగా వున్నాయి. నగర సందర్భక వివరాలు ఎంతో ఉపయుక్తంగా వున్నాయి. చిత్రాలు అపురూపం. 'కవిత్వమ్'లో ఉత్తరాల రాక్షసి అంటూ రచయిత రాసిన పదాలు రియల్లీ హాట్సాఫ్. 'తెలుసుకుందామా'లో లక్క గురించిన వివరణ, చరిత్ర, ఉపయుక్తాలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకాలు. కవర్‌స్టోరీ 'అక్షర నక్షత్రాలు' వ్యాసం ఎంతో ధీటుగా వుంది. ఇందులో ప్రజాశక్తి చేస్తున్న కృషి, విదేశీ పుస్తకశాలల వింతలు, స్కీముల గురించిన వివరాలు ఎంతో నచ్చాయి. ఈవారం 'కథ' పడిలేచిన కెరటం ఆలోచనాత్మకంగా వుంది. సారాంశం బాగుంది.

టి.వి.డి.ఎన్.సీతారామారావు, విజయవాడ.

చక్కని కథ

ఏప్రిల్ 18 నాటి స్నేహ సంచికలో అట్టమీది కథగా వరప్రసాద్‌గారి 'అక్షర నక్షత్రాలు' సాహితీ ప్రియులందరికీ నచ్చేవిధంగా వుంది. అరుణగారి 'పడిలేచిన కెరటం' కథ చక్కగా వుంది. శేఖర్ ఎండాకాలం కార్టూన్లకు పూర్తి పేజీ కేటాయించడం బావుంది. 'సగం మనిషి' దృగ్విషయాలు అబ్బురపరిచాయి. కవితలు రెండూ సామాజిక స్పృహతో ఉండడమే కాక, శైలిలోనూ విభిన్న రీతిలో ఉండడం గమనార్హం. ఈ సారి రుచిలో అన్ని రకాల పచ్చళ్లు పోషకాహార సహితంగా ఉండడం అందరికీ ఉపయోగకరంగా వుంది. చూద్దామా ద్వారా ఇస్తాంబుల్ నగర విశేషాలు తెలుసుకున్నాం. బాలనేస్తాలులో చిత్రవిచిత్రం నిజంగా చిత్రాతి చిత్రంగా వుంది. విజ్ఞాన వీచికలోని ధరిత్రీ కష్టాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనందరమూ కారణమేనన్న సంగతి అందరం గుర్తెరిగి ఇకనైనా బాధ్యతగా మెలగాలి. మనలోమాటగా సెలబ్రిటీల పెళ్లిళ్ల పుణ్యమా అని ఎలక్ట్రానిక్ మీడియాకు అనవసరమైన, ప్రయోజనం లేని వార్తల్ని ప్రచారం చేసే అవకాశం మరోసారి వచ్చినట్లయింది.

నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

కవర్‌స్టోరీ చైతన్యపూరితం

ఈ నెల 23 ప్రపంచ పుస్తక దినోత్సవ సందర్భంగా ప్రచురించిన కవర్‌స్టోరీ అక్షరనక్షత్రాలు చైతన్యపూరితమైనది. విశాలాంధ్ర ప్రచురణాలయం కమ్యూనిస్టు సాహిత్యాన్ని రష్యన్ నవలల్ను అమ్మ మొదలగు వాటితో పాటు కమ్యూనిజం తెలుగు అనువాద పుస్తకాలను ప్రజలకు అందించింది. ప్రజాశక్తి సంస్థ ఎప్పటికప్పుడు సామాజిక అంశాలతో పుస్తకాలను అందిస్తూనే వుంది. ఐతే సామాజిక అంశాల పుస్తక పఠనంపై ప్రజలకు ఆసక్తి తగ్గింది. ప్రజాశక్తి ముందంజలో వుండడానికి కారణం సరసమైన ధర, సమాచార విషయాలపై పట్టు కలిగి వుండడమే.

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక, విశాఖ.

జ్ఞానం పెంపొందిస్తుంది

ఏప్రిల్ 18 ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ చదివిన తర్వాత మానవునికి పుస్తకాలకు మధ్య గల అనుబంధం పురాతన కాలం నుండి వుందని తెలుసుకున్నాం. జాతీయోద్యమ స్ఫూర్తితో దేశ భక్తులు పుస్తకాలను ముద్రించి ప్రజలకు అందించడం అభినందనీయం. మన రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో విశాలాంధ్ర ప్రచురణాలయం పుస్తక ప్రచురణను చేపట్టి ప్రతి ఒక్కరిలోనూ పుస్తక పఠనం పట్ల అభిరుచిని కల్గించింది. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఒక అడుగు ముందంజలో వుండి జాతీయ స్థాయి ప్రచురణ సంస్థల పబ్లికేషన్లు విక్రయించి జ్ఞానాన్ని పెంపొందిస్తోంది. కమ్యూనిస్టు యోధుడు జ్యోతిబసు ఆత్మకథ 'నా రాజకీయ జీవితంలో కొన్ని జ్ఞాపకాలు' నెల రోజుల్లో పదివేల కాపీలు అమ్ముడుపోవడం హర్షదాయకం. నేడు ప్రతి వారికి అనేక రకాల పుస్తకాలు తక్కువ ధరలోనూ, అందుబాటులోనూ వుంటున్నాయి. వ్యాసకర్తకు ధన్యవాదాలు.

కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్.

అక్షరసత్యాలు తెలుసుకున్నాం

ప్రజాశక్తి ఆదివారం ద్వారా పుస్తకాల విలువ తెలుసుకున్నాం. జ్ఞానానికి మూలాధారమైన అక్షర సత్యాలు తెలుసుకున్నాం. అక్షరాలే నక్షత్రాలుగా మెరుస్తున్నాయి. ప్రతి ఒక్కరినీ విద్యారంగంలో ముందుకు నడుపుతూ అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తున్నాయి. చేతు తెచ్చిన పాము పెంపకంతో ప్రజలకు కనువిప్పు కలిగింది. బాలనేస్తాలుతో పిల్లలకు ఆదివారం ఆనందం లభిస్తుంది.

బుర్రి కుమార్‌రాజు, రత్నపురి కాలనీ, గుంటూరు.

★

స్పెషల్ బంపర్ ఆఫర్! ఈ అవకాశం 2000 మందికే!

రోజుకు ఖర్చు
రూ.3/- లు!

ఇంగ్లీష్‌లో సులభంగా మాట్లాడండి!

రూ.610/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.200/- లకే

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	+	డివిజన్-2	+	డివిజన్-3	=		
రూ.170/-	+	రూ.200/-	+	రూ.240/-	=	రూ.610/-	ఇవన్నీ రూ.200/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ రూ.130/-

డివిజన్-2 ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది.ఈ కోర్సు రూ.210/-

పూర్తి డబ్బు వాపస్

మీ డబ్బుకి 100% గ్యారంటీ. ఈ కోర్సు మీకు 100% సంతృప్తిని ఇస్తుంది. మనస్ఫూర్తిగా మీకీ కోర్సు నచ్చలేదని అనిపిస్తే, ఈ కోర్సు పుస్తకాలని బరబరా చింపేసి, ఆ ముక్కల్ని 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ.చేస్తాం. ఇది మీ డబ్బుకి మేమిచ్చే గ్యారంటీ! మీరీ కోర్సులో చేరినందువల్ల లాభమేతప్ప ఎటువంటి నష్టమూలేదు. గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ ఉంటాయి. ఈ కోర్స్ తరువాత కూడా కొన్ని కోర్స్‌లు కలవు. వాటిని మీకు నియమిత నామ మాత్రపు ఫీజుతో పంపడం జరుగుతుంది.

ఈ కోర్స్ మొత్తం రెండు నెలలు. ఒక్కొక్క రోజుకు రూ 3/- ల ఖర్చు మొత్తం సుమారుగా రూ 200/- ల తోనే ఇంగ్లీష్ నేర్చుకోండి.

కోర్స్ గిఫ్ట్ పుస్తకాలు
(4 ఇన్ 1 పోకెట్ సైజులో)



(బొమ్మలో చూపిన ప్రకారం కాకుండా పోకెట్ సైజు పుస్తకాలే అని గమనించగలరు)

1. వర్డ్ పవర్ (ఆంగ్ల పదాల అద్భుత శక్తి)
2. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ (ఇంగ్లీష్‌లో ఉత్తరాలు వ్రాసే పద్ధతి)
3. వెర్బ్స్ డిక్షనరీ (క్రియలు - వాటి రూపాలు)
4. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ (ఆంగ్ల సమాన పదాలు & వ్యతిరేక పదాలు)

స్పెషల్ బంపర్ ఆఫర్ కూపన్

STUDENTS' ENGLISH INSTITUTE

5115-122

Post Bag No. 8569,
New No. 203, Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.610/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు మరియు 4 ఉచిత పుస్తకాలు , ఇవన్నీ కలిపి కేవలం రూ. 200/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.
(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్సును పంపుటకు వీలుపడదు)

Name: ....

Address: ....

....

....

.... Pincode: [ ][ ][ ][ ][ ][ ]

స్ఫూర్తి

సుధామ
సీనియర్ రచయిత, జర్నలిస్టు

శ్రీశ్రీ మహా ప్రస్థానం అనంతం

ఒక పుస్తకం జీవితాన్ని ప్రభావితం చేస్తుందా అంటే అది నేరుగా చేయదు. మనం ఒక వయసులో బాల్య ప్రభావాల కుటుంబం నుండి చదువు పేర, స్నేహితుల పేర సమాజంలో సంచరిస్తున్నప్పుడు బహిర్గతంగా తెలియని ఘర్షణ ఒకటి అనివార్యంగా లోన జరుగుతూనే వుంటుంది. కుటుంబ వాతావరణ శక్తి, సమాజ వాతావరణ శక్తి ఒక్కటిగా వుండవు. ఎదుగుతున్న క్రమంలో పరస్పరం ఆ శక్తులూ సంఘర్షిస్తాయి. చరిత్ర అంటే ఓ గతి, ఓ నడక, ఒక రూపుదిద్దుకున్న క్రమం అనుకునేట్లయితే మనదైన వ్యక్తిత్వం వికసించే మార్గంలో స్ఫూర్తినిచ్చే అంశాలలో పుస్తకాలు, మనుషులు కూడా వుంటారు. వాటిల్లో ఒక మలుపు దశలో కంఠదఘ్నంగా ప్రభావం వేయగల జీవితచరిత్రను మలుచుకునే క్రమంలో స్ఫూర్తిదాయకమైన గ్రంథమూ, వ్యక్తి ఎవరో వుంటారనుకోవచ్చు.

మతం చెప్పినా గతి తార్కిక భౌతికవాదం చెప్పినా 'నిన్ను నువ్వు తెలుసుకో' అనే చెప్పాయి. తన వివాహ విషయంలోనూ మతావలంబన విషయంలోనూ తనదైన స్వేచ్ఛను స్వీకరించి అనుసరించుకోలేనివాడు స్వతంత్ర జీవి అనడానికి తగడు. తప్పటడుగుల బాల్యం నుండి పాఠశాలలో ప్రవేశించడంతోనే గురువులు, స్నేహితులతో కలిసి సాగే సామాజిక జీవనం మొదలౌతుంది. విద్యారంగానికి అందుకే ఎనలేని ప్రాధాన్యత వుంది. చిన్నప్పుడు చదువుకున్నవే చితిమంటల వరకు గుర్తుంటాయి. బతుకు పుస్తకంలో వివిధ పుటలుంటాయి. కొన్ని సువర్ణాక్షరాలవి. ప్రతి పుటలో వివిధ రసానుభవాలుంటాయి. కొన్ని పేజీలు పదే పదే దాచుకోవాలనిపిస్తే, కొన్ని చింపేస్తే బాగుండు అనిపించవచ్చు. కానీ చరిత్ర చింపేస్తే చిరిగిపోదు, చెరిపేస్తే చెరిగిపోదు. తనను తాను మభ్యపెట్టుకుని, మరుగు పరుచుకుని లోకానికి విదితమయ్యేవాడు చిత్తశుద్ధీ, నిజాయితీ లేని వాడవుతాడు. తనదయినా కూడా చారిత్రక యధార్థం సత్యం నిష్కర్షగా చెప్పుకోగలగాలి. రచనకూ, జీవితానికీ అనుకునేదానికీ ఆచరించేదానికీ పొంతన కనిపించినప్పుడు వ్యక్తి ఎక్కువ సమాదరణీయుడవుతాడు. 'అనకాపల్లికి దారి' అని దారి చూపించేబోర్డు అనకాపల్లి వెళ్లదన్నట్లుగా 'మార్గదర్శి' ఆ మార్గంలో నడిపించేవాడేగానీ తాను నడిచేవాడు కాకపోయే సందర్భాలుంటాయి. అందుకనే ఒక గ్రంథం నుండి గానీ, మనిషి నుండి గానీ స్ఫూర్తి పొందడం అనేది పొందేవాడిననుసరించి వుంటుంది. సూర్యుడు తన కిరణాన్ని మణిమీదా, మట్టిముద్ద మీదా ఒకేలా ప్రసరింపచేస్తాడు. ఆ కిరణంతో మణి ప్రకాశిస్తుంది. మట్టిముద్ద ప్రకాశించదు అంటే అది వాటివాటి తీరునుబట్టేకదా!

పదహారేళ్ల ప్రాయంలో అప్పుడప్పుడే లోకాన్ని సమాజజీవిగా అర్థంచేసుకుంటున్న రోజుల్లో 1967లో నాకు శ్రీశ్రీ 'మహాప్రస్థానం' చదవడం తటస్థించింది. ఇక్కడ అనివార్యంగా నా గురించి కొంత చెప్పాలి. కర్నూలు కాక హైదరాబాద్ రాజధానిగా మద్రాసు నుండి తరలి వచ్చిన కుటుంబమే మాది. మా నాన్నగారు కీ.శే.అల్లంరాజు కామేశ్వరరావు గారు వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగి. 1956లో ఒకటో తరగతిలో హైదరాబాదులోనే చేరాను. సుల్తాన్ బజార్ క్లాక్‌టవర్ ఎదురుగా ఓ చిన్న పాఠశాలలోనే చేరాను. ఆ తర్వాత మలక్‌పేట కాలనీలో మా నాన్నగారికి క్వార్టర్ కేటాయించడంతో కేశవ మెమోరియల్ స్కూల్లో ఆరవతరగతి చదివాను. మలక్‌పేట ప్రభుత్వోన్నత పాఠశాలలోనే 7వ తరగతిలో చేరి ఆనాటి హెచ్.ఎస్.సి పాసయ్యాను. స్కూల్లో వుండగానే గ్రంథాలయం పీరియడ్ వుండడం వల్ల బాల సాహిత్య గ్రంథాలేవో ఉపాధ్యాయులు చదివించిన గుర్తు. పదేళ్ల ప్రాయంలోనే 'విజ్ఞాన జ్యోతి' అనే లిఖిత పత్రిక నిర్వహించాను. తెలుగు మీద మమకారం, కృష్ణమూర్తి, వెంకటేశ్వరశర్మగార్లు కలిగించారు. హెచ్.ఎస్.సి తర్వాత వివేకవర్ధినీ కళాశాలలో పి.యు.సి సైన్స్ గ్రూప్‌లో చేరాను. హైస్కూల్ తెలుగు మీడియం నుండి కాలేజీలో ఒక్కసారిగా ఆంగ్లమాధ్యమం కావడంలో బెంబేలు పడ్డాను. లెక్కలూ, సైన్సూ లేని విద్య కోసం వెదికి ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాలలో డిప్.ఓ.యల్ (డిప్లమో ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్)లో చేరాను. పి.యు.సిలో తెలుగు క్లాసు ఒకటే నిడదవోలు సర్వేస్వరరావుగారిది ఆసక్తికరంగా వుండేది. పాఠ్యగ్రంథంలోని పానుగంటివారి 'స్వభాష' నన్ను తొలుతగా ఆకర్షించిన వచన రచన.

నాకు ప్రభావోపేతమైన 1967వ సంవత్సరంలోనే 'యువభారతి' సంస్థతో అనుకోకుండా పరిచయం కలిగింది. సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయంలో ప్రతినెలా మొదటి, మూడవ ఆదివారాలలో జరిగే సాహిత్య సమావేశాల గురించి డెక్కన్ క్రానికల్ సిటీడైరీలో చూసి సాహిత్య సమావేశం చూడడానికి వెళ్లిన నాకు అతిథులను కూడా వారిలో కలుపుకుని కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసిన యువభారతి తీరు నచ్చింది. కాళోజీ నారాయణరావు, కృష్ణమూర్తి వంటి ప్రముఖులున్న ఆ తొలి సమావేశంలోనే అప్పటికప్పుడు వచ్చిన అంశంపై రెండు నిమిషాలు మాట్లాడే 'క్లుప్తగోష్ఠి'లో పాల్గొని బ్యాలెట్ ద్వారా ఉత్తమవక్తగా ఎంపికైన నాకు అందిన పుస్తక బహుమతి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'. 1930ల్లో టైఫాయిడ్ జ్వరం పడిలేచాక శ్రీశ్రీ మహా ప్రస్థానం

కాలం పరిణామ శీలమైంది. గతి శీలమైంది. శ్రీశ్రీలో లేనిదాన్ని వెదుక్కోవడం బదులు, శ్రీశ్రీలో ఉన్నదాన్ని, అది కలిగించే స్ఫూర్తిని, మహా ప్రస్థాన కవిత్వపు ఆచరణాత్మక ఆవేశాన్ని అందిపుచ్చుకోవడం విజ్ఞత. శ్రీశ్రీ శూన్యాన్ని పూరించినవాడు. శ్రీశ్రీ తర్వాత శ్రీశ్రీ స్ఫూర్తితో శూన్యం ఏర్పడే వీలేలేదు. 'మహాప్రస్థానం' ఒక చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించింది. శ్రీశ్రీ కవిత్వాన్ని తూచే తూనికరాళ్లు నాడు తన దగ్గర లేవన్నాడు చలం. నేడు మన కొలతల్లో శ్రీశ్రీని దూర్చవలసిన అవసరం లేదు. శ్రీశ్రీ అందించిన కవిత్వపు కొలతలు అవగాహన చేసుకుంటే, ఏ సామ్యవాద దిశగా తానాశించిన 'మహాప్రస్థానం' నేటి సమాజం సాగించగలదో విశ్లేషించుకుని అనుగమిస్తే అదీ ప్రయోజనదాయకం.

గీతాలు రాస్తే 'మహాప్రస్థానం' చదవడంలోనే నేను జ్వరానపడి క్షాళనమయ్యాను. నాకెంతో స్ఫూర్తిదాయకమైంది ఆ కవిత్వం. నా సాహిత్యాభిలాషను ప్రేరేపించడమే కాదు 'ఒక సకలాతీత శక్తి ఉన్నట్లు లేనట్టా' అనే సంశయగ్రస్తుడనై వున్న తరుణంలో వ్యక్తి కన్నా సమిష్టి విలువను ప్రబోధిస్తూ, సమాజ హితచింతనతో నేనుసైతం ప్రపంచాగ్నికి ఒక సమిధనన్న లక్ష్యాన్ని ప్రేరేపించి నన్ను అభ్యుదయ పథగామిగా వామపక్ష భావాలవైపు మొగ్గేలా ఆనాడు చేసింది మహాప్రస్థానమే. 'దేశచరిత్రలు' చదివి ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కన్పించని కథలన్నీ కావాలిప్పుడు దాచేస్తే దాగని సత్యం అని గ్రహించాను. యువభారతి సంస్థలో నాడు కాళోజీ 'జీవనగీతి' (ఖలీల్ జిబ్రాన్ ద ప్రాఫెట్‌కు అనువాదం) ప్రచురణకు శుద్ధ ప్రతి తయారు చేయడంలో పాల్గొంటూ కాళోజీగారితో యువకునిగా సాన్నిహిత్యాన్ని, ఉత్తర ప్రత్యుత్తరాలను పొందగలిగాను. చదివింది ప్రాచ్యవిద్యయే అయినా ప్రాచ్య కళాశాల ప్రిన్సిపల్‌గా వున్న ఆచార్య కె.కె. రంగనాథాచార్యులుగారు అభ్యుదయ భావోద్దీపన కలిగించారు. యువభారతి వంగపల్లి విశ్వనాథంగారు 'సమైక్య దృష్టి' అలవడేందుకు హేతువయ్యారు. అందుకే శ్రీశ్రీ కవిత్వంవైపు నేను ఆకర్షితుడిని, ప్రభావితుడిని అయ్యానేగానీ వ్యక్తిగా ఆయన వీరాభిమానిని కాలేదు సరికదా ఆ సిగరెట్లు, మద్యపానాలకు దూరంగా వున్నాను.

"ఆయన రాసి పారేసిన కవిత్వం గుభాళిస్తుండగా
తాగి పారేసిన సీసాల సంగతి ఘనకెందుకు"

అన్నీ కాళోజీ మాటలే మహాప్రస్థానానికి ప్రభావితుడిని చేశాయి గానీ శ్రీశ్రీ కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని కలగలుపు చేసుకుని కలవరపడనేలేదు నేను. సైకిల్ కొనుక్కోమని ఇంట్లో రెండువందల రూపాయలిస్తే ఆ డబ్బులతో మద్రాసుకు రైల్లో వెళ్లి శ్రీశ్రీని ఆయన ఇంట్లో తాగి తూలుతూ అనంతంగా రంగనాయకమ్మను దూషిస్తున్న స్థితిలో చూసిన యువ మిత్రుడు సుబ్బారావు తిరిగి వచ్చి ఆ విషయం మాతో చెప్పాక మహా కవుల జీవితాలను కాక వారి రచనలను, అందులోని భావాలను గ్రహించి అనుష్ఠించడమే సబబు అనిపించింది. మహాప్రస్థానంలోని ప్రతి కవితా నాకు స్ఫూర్తిమంతమే. లోకం తీరునంత

"నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో మీరు
నెత్తురు కక్కుకుంటూ నేలకు రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా దీరే" అంటూ 'ఆః' అన్న ఒక్క అక్షరాన్ని అర్థవంతమైన అద్భుత శీర్షికగా నిలిపి స్వరోచ్చారణలోని దాని ఉత్థానపతనాలతో రూపుకట్టించిన తీరు ప్రశంసలకూ, తిరస్కారాలకూ అతీతంగా వ్యక్తి తనదైన నిబద్ధతతో, నిమగ్నతతో వుండాలని సందేశిస్తూనే వుంది.

'జగన్నాథ రథచక్రాలు' ను శ్రీశ్రీ బ్రాహ్మణిక భావజాలంతో కవిత్వీకరించాడని ఆ మధ్య ఏదో పత్రికలో ఓ దళిత కవి రాశాడు. 'స్వరం జగన్నాథం అని' తాడితుల పీడితుల కోసం ఎప్పటికప్పుడు విధ్వంసం నుండి కొత్త సృష్టి చేసుకునే దారు విగ్రహాలతో జరిగే జగన్నాథ రథయాత్ర సర్వమానవ ఏకీకరణ సంకేతం అనే నా ప్రగాఢ భావన. పతితులారా భ్రష్టులారా బాధాసర్పదష్టులారా పనికిమాలి బ్రతుకు కాలి శనిదేవత రథ చక్రపుటిరుసులతో పడి నలిగిన హీనులను సముద్ధరించేందుకే వారికోసమే కలం పట్టి ఆకాశపు దారివెంట హడావిడిగా వెళ్లిపోయే రథచక్రపు ప్రళయఘోషను భూమార్గం పట్టించిన అసలైన సామ్యవాదకవి శ్రీశ్రీ.

'మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది' అని సమాజాంతర్గతంగానే వున్న నవ్యలోకాన్ని ఆవిష్కరించి ఎర్రబావుటా ధగధగలను హోమజ్వాలల భుగభుగలను సమ్యక దృష్టితో సమీకరించి సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు తాను విరచించే నవీనగీతికి ప్రాణం, ప్రణవంగా స్వీకరించి తెలుగు కవిత్వానికి ఒక అంతర్జాతీయ దృక్పథాన్ని, 'ప్రపంచకార్మికులారా ఏకంకండు' అని విశ్వజనీన శ్రామిక ఏకీకరణను లాంగ్ మార్చ్ చేయించాడు. నవయుగ భగవద్గీతా ఝుంఝును సాయుధ విప్లవరథ సారథియై పలికించాడు.

1930–1940ల మధ్య రాసిన మహా ప్రస్థానం గీతాలే శ్రీశ్రీని మహాకవిని చేశాయి. "1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. నాటినుంచీ తెలుగు సాహిత్యాన్ని నేను నడిపిస్తున్నా. ఈ శతాబ్దం నాది" అన్న శ్రీశ్రీ ఆత్మవిశ్వాసానికి 'మహాప్రస్థానం' లోని గీతాలే ప్రాతిపదికలు. ఈ తర్వాత సర్రియలిస్టు ధోరణిలో రాసిన 'ఖడ్గసృష్టి' కవితలు 'విచిత్రమే సౌందర్యం, సౌందర్యమే విచిత్రం' అన్న దాఖలాగా సిరిసిరిమువ్వ, లిమరిక్కులు, ప్రాసక్రీడలు (సిప్రాలి) వంటి ప్రయోగావైవిధ్యాలు, సినీగీతాలు ఏవయినా అతనికీర్తిని ఆనుషంగికాలే. మరోప్రస్థానం నాటికే సమాజ ధోరణులు మారిపోయాయి. మహాప్రస్థానంతో శ్రీశ్రీ ఏకోన్ముఖంగా సంకల్పించిన సామ్యవాదశీల 'మరోప్రపంచం' విరసంతో అంతర్జాతీయ దృక్పథం నుండి ఎడమైపోయింది. సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు కార్మికలోకపు కళ్యాణానికి, శ్రామికలోకపు సౌభాగ్యానికి ఏకీకృతం కావడం పోయి కుల, మత, ప్రాంత, యాసల పేరిట వేటి కుంపట్లు అవి వేరుగా పెట్టుకోవడం ప్రబలింది. అందుకే శ్రీశ్రీ కవిత్వంలో ఒక సమగ్రతా వీక్షణాన్ని దర్శించక తమ కుల, వర్గ, ప్రాంత అస్తిత్వం స్త్రీ వాద, దళిత స్పృహలు లేవు గనుక శ్రీశ్రీ 'రిలెవెన్సీ' నేడు లేదనీ శ్రీశ్రీ గారికి నిజంగానే 'నూరేళ్లు నిండాయి' అనేవారు బయలుదేరారు.

కాలం పరిణామ శీలమైంది. గతి శీలమైంది. శ్రీశ్రీలో లేనిదాన్ని వెదుక్కోవడం బదులు, శ్రీశ్రీలో ఉన్నదాన్నీ, అది కలిగించే స్ఫూర్తిని, మహా ప్రస్థాన కవిత్వపు ఆచరణాత్మక ఆవేశాన్ని అందిపుచ్చుకోవడం విజ్ఞత. శ్రీశ్రీ శూన్యాన్ని పూరించినవాడు. శ్రీశ్రీ తర్వాత శ్రీశ్రీ స్ఫూర్తితో శూన్యం ఏర్పడే వీలేలేదు. 'మహాప్రస్థానం' ఒక చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించింది. శ్రీశ్రీ కవిత్వాన్ని తూచే తూనికరాళ్లు నాడు తనదగ్గర లేవన్నాడు చలం. నేడు మన కొలతల్లో శ్రీశ్రీని దూర్చవలసిన అవసరం లేదు. శ్రీశ్రీ అందించిన కవిత్వపు కొలతలు అవగాహన చేసుకుంటే, ఏ సామ్యవాద దిశగా తానాశించిన 'మహాప్రస్థానం' నేటి సమాజం సాగించగలదో విశ్లేషించుకుని అనుగమిస్తే అదీ ప్రయోజనదాయకం. శ్రీశ్రీని కాదనుకుని ముందుకెళ్లిపోదామని అనుకున్న వారికెవరికయినా అతను స్ఫూర్తిదాయకమై నీడలా అనుసరించి వస్తాడన్న నిజం ఎలాగూ అంతఃకరణంలో అవగతమవుతూనే వుంటుంది.

శ్రీశ్రీ స్ఫూర్తి అందుకోగలిగిన వారికి అదెన్నడూ ఆరిపోని దీపం.

★

నాకు ప్రభావోపేతమైన 1967వ సంవత్సరంలోనే 'యువభారతి' సంస్థతో అనుకోకుండా పరిచయం కలిగింది. సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయంతో ప్రతినెలా మొదటి, మూడవ ఆదివారాలలో జరిగే సాహిత్య సమావేశాల గురించి డెక్కన్ క్రానికల్ సిటీడైరీలో చూసి సాహిత్య సమావేశం చూడడానికి వెళ్లిన నాకు అతిథులకు కూడా వారిలో కలుపుకుని కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసిన యువభారతి తీరు నచ్చింది. కాళోజీ నారాయణరావు, ఇలిమెంటి కృష్ణమూర్తి వంటి ప్రముఖులున్న ఆ తొలి సమావేశంలోనే అప్పటికప్పుడు వచ్చిన అంశంపై రెండు నిముషాలు మాట్లాడే 'క్లుప్తగోష్ఠి'లో పాల్గొని బ్యాలెట్ ద్వారా ఉత్తమవక్తగా ఎంపికైన నాకు అందిన పుస్తక బహుమతి శ్రీశ్రీ 'మహాప్రస్థానం' 1930ల్లో టైఫాయిడ్ జ్వరం పడిలేచాక శ్రీశ్రీ మహాప్రస్థానం గీతాలు రాస్తే 'మహాప్రస్థానం' చదవడంలోనే నేను జ్వరానపడి క్షాళనమయ్యాను.



గొంతు పంట



ఇసుక గూళ్లంత
సులువూ కాదు, సరదా కాదు
కోటల నిర్మాణం!
ఆడుకొని ఆడుకొని
కాళ్లతో చెరిపేసే పనీ కాదు
కోటల నిర్మాణం!
పేటలకి బదులు
కోటలకి ఇటుకలు మోస్తున్నారు!
పేటల్లో సాపాటుకి బదులు
కోటలకి కంకర కలుపుతున్నారు!
దేవుళ్లు దొరుకుతారు
మనుషుల్లో!
అయినా
బడులు మూసేస్తున్నారు, గుడులు మోస్తున్నారు!
కోటలూ, గుడులూ
స్వేచ్ఛావాయువులకి ప్రాణం పోస్తాయా!
ఇంగ్లీషు కోట శిధిలాలు
ఇక్కడ చిగురిస్తున్నాయా!
హిందీకోటకి అడ్డుకట్టేసి
తమిళపుకోట మొలుచుకొస్తుందా!
తెలుగు కుత్తుకలు కత్తిరిస్తుందా!
పాకిస్తాన్ కలల్లో ఆడుతుంది!
పేటలు
తేనె పట్టులు పెంచుతుంటే
కోటలు వాటిని పిండుకుంటున్నాయి!
కోటలు సున్నాలుగా కాకుండా
చెమటలు
పేటల కంచాల్లో పాయసాలుగా మారాలి!
దేవుళ్లు దొరుకుతారు మనుషుల్లో!
బడిగంటలు మోగాలి మడుల్లో!
కోటల ఆనవాళ్లు కనపడని,
గొంతుకలు పండించే
కళ్లు పరిమళించే నాయకత్వం
దిక్సూచి
ఏ దేశానికైనా, ఏ ప్రజలకైనా!

- ఒబ్బిని సన్యాసిరావు

తల్లిని మించిన తల్లి



ఆ సముద్రం పలుదేశాలకు సరిహద్దు
ఒకటా రెండా ఏకంగా పది దేశాలు
ఒడ్డున కాలూనిన ప్రతి వ్యక్తి
బిందుసేద్యంలా నెత్తిన నీళ్లు చల్లుకుంటాడు
తల్లి ఆశీస్సులు కోరుకుంటాడు
తల్లిని మించిన తల్లి సముద్రం
సముద్రానికి అన్ని దేశాలు ఒక్కటే
అన్ని సంస్కృతులు ఒక్కటే
దేశదేశానికి
మనిషి మనిషికి అనుసంధానం సముద్రం
పడవ పొడవైనా పొట్టిదైనా
లావైనా సన్నమైనా
ఏ రూపమైనా
సముద్రానిది సమభావం!
కొండకు తగిలి పగిలినా
తుపానుకు మునిగినా
అసందర్భంగా బద్దలైనా
హఠాత్తుగా పేలినా
సముద్రం తల్లడిల్లుతుంది
కంట తడిపెడుతుంది
మరణించిన మనుషుల్ని వెతికి
నీటి తలాన్ని చాపగా చేసి
పార్థివ శరీరాన్ని పండబెడుతుంది
చిరునామాలు చూపుతుంది!
స్వదేశంలోనూ
పరదేశంలోనూ
మరణించిన హృదయాల ఎత్తుగడలు
విధ్వంసకర ఆలోచనలు
పోస్టుమార్టం రిపోర్టులో చదివి
సముద్రం చెలియలికట్టకు
తల బాదుకుంటుంది !

- అడిగోపుల వెంకటరత్నమ్

మృత్యులోయలు

వలసలు సాలు వడ్డయి
పల్లె మొత్తం
బీడు బట్టి
బాడువలు అగ్గి రగుల వట్టె
ఉట్టిగనే వుండె...
గరిసెలొడ్లు లేక గరీబోని
లెక్క గుడిసె ముందు
ఉలిబెట్టుకొని మా రైతన్న!
అప్పలు దెచ్చి ఆలు బిడ్డల
సొత్తనన్న కోర్కె కొంపముంచె
ఇత్తనమడ్లు ఇగిలించినయి
మందు బస్తలు నడుములిర్గ గొట్టినయి
వానలేక వాగులొంకలెండిపోతంటే
మృత్యువు నరవాసన
వెతుక్కుంట వచ్చింది
ఎక్కడి మబ్బులక్కన్నే
డెత్ అరెస్ట్ అయినట్లున్నయి
ఎండలు కుమ్మరించిన
నిప్పల మళ్లను
రైతుల ఆత్మలు అలుపు లేకుంట
ప్రార్థిస్తనే వున్నయి.
ఒక్కనాడన్న కన్నపేగుకు
పల్లెం నిండ అన్నం కడుపార
పెట్టె బలం చేతులకియ్యమని.
ఏ పొలవుల జూసినా
రైతుల్లేని జాడ
నోర్లు తెరుసుకున్న బోరు బావులు
చెప్తనే వున్నె!
కాలానికి సొచ్చెం ఇయ్యనోనికె
మృత్యులోయలుగా!!

- తమ్మెర రాధిక

విజ్ఞాన వీచిక

మన రాత మన చేతిలోనే

మానవ మేధకు దాహం అనంతం. ఇప్పటివరకు మానవుడు సాధించిన శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రగతి అందుకు తిరుగులేని నిదర్శనాలుగా నిలుస్తాయి. విశ్వరహస్యాలను ఛేదించడానికి, అవగాహన పెంచుకోడానికి, అర్థం చేసుకోవడానికి మన ప్రయత్నాలు అపారం. అటువంటి ప్రయత్నాలలో మహోన్నతమైనదని భావించేది హ్యూమన్ జీనోమ్ ప్రాజెక్ట్.

ఒక జీవి తాలూకు సర్వ జన్యు సమాచార సమాహారమే జీనోమ్. మానవ జీనోమ్ ఇరవై మూడు జతల క్రోమోజోములలో నిక్షిప్తమై వుంది. ప్రతి క్రోమోజోములోనూ డి.ఎన్.ఎ వుంటుంది. ఈ డి.ఎన్.ఎ (డీ ఆక్సీ రైబో న్యూక్లిక్ ఆసిడ్) మాలిక్యులార్ నిర్మాణం గురించి 1953లోనే వాట్సన్, క్రిక్‌లు వివరించారు. అటు తర్వాత యాభై ఏళ్లకు మానవ జీనోమ్ ప్రాజెక్టు ప్రారంభమైంది. వివిధ దేశ ప్రభుత్వాల సహకారంతో పాటు ప్రైవేట్‌గా సీలేరా జీనోమిక్స్ సంయుక్తంగా ఈ మహా యజ్ఞాన్ని నిర్వహించారు.

ఈ మహోత్కృష్ట కార్యం ఏప్రిల్ 2003 నాటికి పూర్తి అయింది. మానవ నిర్మాణానికి మూల్యమైన జన్యు వివరాలు తొలిసారిగా వెలుగు చూశాయి. అయితే ఇంకా ఎన్నో సంవత్సరాల పరిశోధన, విశ్లేషణ తర్వాతగానీ మానవ జన్యుచిత్రంలో దాగిన వివరాలను సవివరంగా అర్థం చేసుకోలేము.

విచిత్రమేమిటంటే ఏడేళ్ల క్రితమే మానవ జన్యు మాపింగ్ సంపూర్తి అయినట్లు ప్రకటించినా, మానవుడిలో కచ్చితంగా ఎన్ని జన్యువులు ఉన్నాయో ఇంతవరకు తెలీదు. ఒకప్పుడు ఒకటి నుండి మూడు లక్షల జన్యువులుగా ఊహించినవి ప్రస్తుతం ఇరవై అయిదు వేల వరకు ప్రొటీన్లు రూపొందించే జన్యువులు వున్నాయని అంటున్నారు. మనం ఈ సృష్టిలో అత్యున్నత స్థానంలో వున్నాం. కాబట్టి మనకి అత్యధిక సంఖ్యలో జన్యువులు వుంటాయిని అనుకోడానికి లేదు. ఉదాహరణకి చిట్టెలుకకు ముప్పై వేలు, ఒకరకం జపనీస్ చేపకి నలభై వేలు, చింపాంజీకి ఇరవై మూడు వేల జన్యువులు ఉన్నాయి. మనం రోజూ తినే వరి మొక్క జన్యువులు సుమారు యాభై అయిదు వేల ఆరువందలు!! వరి మొక్క క్రోమోజోములు 12.

మానవులు అత్యంత వైవిధ్యంగా వుంటారు. అనేక రకాల జాతులు, ఉపజాతులు, ప్రాంతీయ భేదాలు కలిసి (మానవులంతా ఒకటే అన్నా) నిజానికి విపరీతమైన మార్పులు కనిపిస్తాయి. మన మానవ జన్యు స్థాయిలో మాత్రం సమానమే. వాస్తవానికి ఏ ఇద్దరు మనుషుల జీనోమ్‌లు పరిగణలోకి తీసుకున్నా, అవి 99 శాతం సమానంగా ఉంటాయి. అయితే మిగిలిన ఆ చిన్న వ్యత్యాసమే అతి ముఖ్యమైనది. ఆ వ్యత్యాసమే (డిఎన్‌ఏలోని వ్యత్యాసాలు) మనలను ఒక్కొక్కరిని ఒక్కొక్క విధంగా విశిష్టంగా ఏర్పడేందుకు కారణం. మన కనుముక్కు తీరులో వ్యాధులకు లోబడే తత్వం నుండే మందులకు స్పందించే లక్షణం వరకు ఆ చిన్న వ్యత్యాసమే మూలం.

ఈ వివరాల ద్వారా, మానవులకు వారసత్వంగా సంక్రమించే వ్యాధుల మూల కారణాలు ఏమిటో తెలుసుకునే వీలు కలుగుతుంది. కారణాలు తెలిసిన పిదప వాటిని నివారించడం సాధ్యపడుతుంది. అలాగే జన్యువులలో ఏమైనా మార్పులు సంభవించే అవకాశాలను ముందుగానే పసిగట్టే వీలు చిక్కుతుంది. ఇంకా ముందుకు ఆలోచిస్తే మనకు కావలసిన జన్యు లక్షణాలతో బిడ్డలను పొందవచ్చు. మరింత ఆశ్చర్యం కలిగించే విషయం... మానవ జీవిత కాలాన్ని మరింత పెంచవచ్చు. వచ్చే కాలంలో మానవ జీనోమ్ గురించి సమస్త వివరాలను సంపూర్ణంగా అర్థం చేసుకునే వీలుందని, ఆ తర్వాత మనం దాదాపు సృష్టికి ప్రతిసృష్టి చేయవచ్చు. కానీ మనం అపర విశ్వామిత్రులం కాము. జీనోమ్ చిత్రం చేతికందగానే మరో సృష్టి ప్రారంభించవచ్చు అనుకోడానికి వీలులేదు. ఇప్పటి వరకు మనం తెలుసుకున్నది కొంత మాత్రమే. మరి కొంత సమయం తర్వాత మరిన్ని విషయాలు తెలుస్తాయి. అప్పటి వివరాలను బట్టి అంచనాలు జరుగుతున్నాయని అనుకుంటున్నారు. ఎంత రహస్యంగా జరిగినా, వాటి ఫలితాలు మాత్రం ఎప్పటికైనా బహిర్గతం కావలసిందే. అవి మంచి చేస్తాయా? మానవ జాతిని అంతం చేస్తాయా? లేక కొత్త మానవులని పుట్టిస్తాయా అన్నది వేచి చూడవలసిందే. ఇప్పటికే జన్యు పరిశోధనలలో నైతిక అంశం ప్రవేశించింది. బాగా ధనిక దేశాలు 'మంచి జన్యువులతో ఆరోగ్యకరమైన జీవులను రూపొందించుకునే వీలుంది. పేద దేశాలు అటువంటి వెసులుబాటు లేక నిర్వీర్యంగా మిగిలిపోవలసి రావచ్చు. ఇది ఇప్పటికి ఊహే గానీ వాస్తవంగా మారడానికి ఎటువంటి అవరోధాలు లేవు. నైతికత కేవలం భావనగానే మిగిలి, చేష్టలు ఎలాగైనా వుండవచ్చునీ ఎన్నో సార్లు నిరూపించబడింది. చూద్దాం. జన్యువులలో వంకర ఆలోచనలకు కారణమైన జన్యువు వుండేదేమో!!

- డా॥ విజయ్

ఈ వివరాల ద్వారా, మానవులకు వారసత్వంగా సంక్రమించే వ్యాధుల మూల కారణాలు ఏమిటో తెలుసుకునే వీలు కలుగుతుంది. కారణాలు తెలిసిన పిదప వాటిని నివారించడం సాధ్యపడుతుంది. అలాగే జన్యువులలో ఏమైనా మార్పులు సంభవించే అవకాశాలను ముందుగానే పసిగట్టే వీలు చిక్కుతుంది. ఇంకా ముందుకు ఆలోచిస్తే మనకు కావలసిన జన్యు లక్షణాలతో బిడ్డలను పొందవచ్చు. మరింత ఆశ్చర్యం కలిగించే విషయం... మానవ జీవిత కాలాన్ని మరింత పెంచవచ్చు. వచ్చే కాలంలో మానవ జీనోమ్ గురించి సమస్త వివరాలను సంపూర్ణంగా అర్థం చేసుకునే వీలుందని, ఆ తర్వాత మనం దాదాపు సృష్టికి ప్రతిసృష్టి చేయవచ్చు.

సీరియల్

వియత్నాం గెరిల్లా



15వ భాగం

జరిగిన కథ :

జంగ్ కుమార్తె గురించి అడుగుతుంది హోవ్. మెల్లగా తన కథ మొదలెడతాడతను. విన్‌చావ్ వద్ద రహస్యంగా వున్న అతణ్ణి శత్రువు పట్టుకుంటాడు. అదీ ఒక వ్యూహం ప్రకారం. జంగ్ వున్న ఇంటి పైకప్పుపై మరింత గడ్డివేసి నిప్పు పెడతారు. అత్యవసర పరిస్థితుల్లో అక్కడినుంచి పొలాల్లోకి తప్పించుకోవడానికి సొరంగ మార్గాలున్నా వెళ్లలేని పరిస్థితి. ఎందుకంటే శత్రువు అక్కడ కూడా కాపు కాశాడు. అలాగని రహస్య గృహంలోనే వుంటే చావు తప్ప మరొకటి లేదు. సాహసించి బయటపడాలనుకుంటారు. జంగ్ చేతిబాంబులు విసురుతూ పిస్తోలు పట్టుకొని బయటకు వస్తాడు. అతనితోపాటు మిగిలిన ఇద్దరూ వస్తారు. ఫ్రెంచి సైనికులు వారిమీద జరిపిన కాల్పుల్లో ఒకరు మరణిస్తారు. జంగ్ మెడ మీద గాయమై స్పృహ తప్పిపడిపోతాడు. ఆ స్థితిలో వున్న జంగ్‌ను తీసుకెళ్లి కారాగారంలో వేస్తారు. వారు పెట్టే చిత్రహింసలన్నింటినీ తట్టుకొని సంవత్సరం తర్వాత పారిపోతాడు. హోవ్ విషయానికొస్తే... అనుపత్రిలో తనకు పార్టీ సభ్యత్వం ఎటువంటి పరిస్థితుల్లో ఇచ్చిందీ చెప్పుంటుంది.. ఆ తర్వాత....

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

సముద్ర గాలికి నావలో రెపరెపలాడుతున్న పార్టీ పతాకాన్ని చూడగానే నా ముఖమంతా ఎర్రబారింది. సజల నేత్రాలయ్యాయి. అయితే, అవి లోగడ మాదిరి కన్నీళ్లు కావు. గత సంవత్సరాల్లో పడ్డ అవమానాన్ని, దుఃఖాన్ని ప్రతి కన్నీటి చుక్కా కడిగి వేసినట్టుగా వుంది. మిగిలిన కామ్రేడ్స్ వంక తేరిపార చూశాను. ప్రతి ఒక్కరూ నా వంక ప్రేమతో చూస్తున్నారు. నా మనసులో ఒక ప్రశ్న ఉదయించింది. ఇటువంటి ప్రేమ ఎందుకు చూపిస్తున్నారు? ఇదేమీ గారడీ కాదు. నావ మీదే కూర్చున్న డువాంగ్ ట్రువాంగ్‌లు నా ఎదుటనే పార్టీ పతాకం ముందు ప్రమాణం చేసిన ఇతర కామ్రేడ్స్ ఇందుకు కారణం.

తగలపడిపోతున్న నావలు, యుద్ధంలో బలిఅయిన బంధువులు, అనుభవించిన కష్టాలు, నేను అనుభవించిన కష్టాలు, వాటన్నిటికీ ప్రతీకారం చేయడానికి ఒక నవ సమాజ నిర్మాణానికి వెలుగుబాట చూపించే ఎర్రజెండా మాకు ధృతిని, త్యాగాన్ని, ఒక దివ్య సందేశాన్ని అందిస్తూ వుంది. "అదే బానిసత్వ నిర్మూలన".

అలలు నావ పక్కన కట్టుకుని విరిగిపోతున్నాయి. బీచ్‌లో వేస్తున్న మంటల కాంతి అప్పుడప్పుడు కొండగుట్టల పైనుండి వచ్చి పడుతోంది. వర్షపాతంలా వచ్చి పడుతున్న గుండ్లవర్షం హఠాత్తుగా తగ్గింది. శత్రువు వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్నాడని ఒక నావ వెళ్లి కబురు తెచ్చింది. శత్రువు తిరోగమనం మమ్మల్ని సంతోష సాగరంలో ఓలలాడించింది.

హీప్‌మీ ప్రాంతంలో జంగ్ శత్రువుల్ని ఎదుర్కొంటున్నాడని ట్రువాంగ్ తెలిపాడు.

వాస్తవానికి ఆ దిక్కుగా తుపాకి పేలుడు శబ్దం బాగా వినపడుతోంది. సమావేశం పూర్తి అయిందని పార్టీ కార్యదర్శి ప్రకటించాడు. వాయ్‌మియకు వెంటనే బయలుదేరి వెళ్లాలని ఉత్తర్వులు వచ్చాయి. నావలోని దీపాల్ని ఆర్పివేశారు. తెర చాపలను సిద్ధం చేశాం. తెడ్లను వేయడం ప్రారంభించాం. అలల్ని చీల్చుకుంటూ మా నావ ముందుకు దూసుకుపోతోంది. హీప్‌మీ దళం జరిపిన దాడిలో 20 మంది శత్రుసైనికులు హతులయ్యారు. సూర్యోదయం సమయానికి మేము ఒడ్డుకు చేరుకున్నాం. బీచ్ అంతా రక్తపు మరకలతో నిండి వుంది. బీచ్‌లో అక్కడక్కడ పడివున్న శవాలను తినడానికి గద్దలు, కాకులు ఆ ప్రాంతంలో ఎగురుతున్నాయి. కొన్ని శవాలు సముద్రపు నీటిలో తేలియాడుతున్నాయి.

అప్పటి నుండి నేను పూర్తిగా పనిలో మునిగిపోయాను. టువాట్ అత్తయ్య ఇంటికి వెళ్లడానికి అవకాశం చిక్కలేదు. పిల్లలు తలపుకు వచ్చినప్పుడు చాలా బాధగా వుండేది. పని ఒత్తిడి ఎక్కువైంది. పిల్లలను అక్కడ వుంచడం తప్ప నేను చేయగలిగింది ఏమీ లేదు. అయితే వీలైనంత వరకు వారిపట్ల శ్రద్ధ తీసుకుంటూ వుండేదాన్ని. చిట్టి థైకి ఆరు సంవత్సరాల వయస్సు వచ్చింది. బడికి వెళ్లే వయసు. అయితే ఆ ప్రాంతంలో పంతులు లేడు. 1952లో యుద్ధంలో గాయపడిన ఒకతను హీప్‌వాంగ్ వచ్చి పాఠశాల పెట్టాడు. థై చిన్నది కావడం, బడికి దూరం కావడం మూలంగా ప్రతి రోజూ ఉదయం టువాట్ అత్తయ్య పాపను బడికి తీసుకెళ్లేది. సాయంత్రం తిరిగి తీసుకొచ్చేది. నేను మాత్రం అటూ, ఇటూ పనిమీద తిరుగుతూ వుండేదాన్ని. ఆక్రమిత ప్రాంతంలోకి వెళ్లడానికి ముందు రాత్రి టువాట్ అత్తయ్య ఇంటికి వెళ్లి పిల్లల్ని ముద్దాడి వచ్చేదాన్ని. తరచుగా వాళ్లు గాఢనిద్రలో వుండేవాళ్లు. భారీ వర్షం పడుతున్నా వెళ్లేదాన్ని. వాళ్లను చూడకుండా వుండలేకపోయేదాన్ని."

హోవ్ చెప్పడం ఆపేసింది. పాత సంగతులు జ్ఞాపకం చేసుకుంటూ వాటిని ఒక వరుసలో కూర్చటానికి ప్రయత్నిస్తోందని భావించాను. ఎదురుచూస్తూ కూర్చున్నాను. కానీ ఆమె మాట్లాడలేదు. ఆమె కళ్లు చెమర్చుతున్నట్లు గమనించాను. ఏదో గుర్తుకువచ్చి బాధపడుతున్నట్లుగా వుంది. వేళ్లను గట్టిగా నొక్కుకుని నిట్టూర్పు విడిచింది.

"అత్తయ్య చాలా దురదృష్టవంతురాలు" అంది.

"ఏమిటి అంటున్నావ్? ఏ అత్తయ్యను గురించి నువ్వు మాట్లాడేది?"

"హోవ్" గొంతులో విచార ఛాయలు కనిపించాయి.

టువాట్ అత్తయ్య పిల్లలను రక్షించే

సమయంలో చనిపోయింది. టువాట్ అత్తయ్య మల్బరీ ఆకులు పోగుచేస్తున్న సమయంలో ఆ దుర్మార్గులు హఠాత్తుగా అక్కడికి వచ్చారు. వాళ్లను చూడగానే ఇంట్లోకి వెళ్లి పిల్లల్ని తీసుకుని పరుగెత్తింది. ఆ కిరాతకులు ఆమెను పట్టుకుని చిత్రహింసలు పెట్టారు. అయినా ఆమె నుండి ఎలాంటి సమాచారం రాబట్టలేకపోయారు. కసితో ఆ సాయంత్రమే ఆమెను చంపేశారు. ఈ విషయం తెలియగానే జనం అక్కడకు పరుగెత్తారు. అప్పటికే ఆమె భౌతిక కాయం బిగుసుకుపోయింది. సమాధి చేయటానికి శవాన్ని అక్కడి నుండి తీసుకెళ్లారు. ఆనాటి రాత్రి దృశ్యం నాకు బాగా గుర్తుంది. బహుశా నా జీవితంలోనే అది మరిచిపోలేను. హీప్‌హాంగ్ మల్బరీ తోటలలో జరిగిన ఆ ఖననం కార్యక్రమానికి నేను హాజరయ్యాను. సామాన్య రైతు స్త్రీ అయినప్పటికీ గొప్ప హృదయం గలది. నా పిల్లల్ని రక్షించడమే కాకుండా, విప్లవానికి తోడ్పడడమని భావించి ఆ రకంగా చేసిన గొప్పవ్యక్తి. తను బతికి వుండడం కంటే పిల్లల్ని రక్షించడం ఎక్కువ ఉపయోగమని తలచిన త్యాగమూర్తి. ఆమెను మరిచిపోవడంగానీ, ఆమె త్యాగానికి మచ్చ వచ్చే విధంగా పని చేయడం కానీ సాధ్యమనుకుంటున్నారా? దానిని గురించే నేను ఆలోచిస్తున్నాను. ఆ విషయం గురించే నేను ప్రశ్నించుకుంటున్నాను. అసంతృప్తి కలిగినప్పుడు లేక వ్యతిరేక విధాన నిర్ణయం తీసుకుంటున్నప్పుడు ఈ విషయం గురించి మరింతగా ఆలోచిస్తాను. అదేదో నా మనసును బాధపెట్టడానికి హఠాత్తుగా వచ్చినది కాదు. పది సంవత్సరాల పాటు జరిగిన వీరోచిత పోరాటం నన్ను బంధించి ఆలోచించేటట్లు చేస్తోంది.

హావ్ త్వరత్వరగా మాట్లాడసాగింది. ఆమె చెప్పే కథలో నేను సమాధానం చెప్పాల్సింది వున్నట్లుగా తోచింది. కానీ, నేను పూర్తిగా ఉద్రేకంతో వుండడం వల్ల చెప్పలేదు. సాయం సమయం. పైగా చలిగా వుంది. ఆస్పత్రిలో ప్రశాంతంగా వుంది. అయినా ఆ సామాన్య స్త్రీ చేసిన త్యాగం వింటూ వుంటే, నాకు వళ్లంతా వణికింది. పెద్దగా అరవాలనిపించింది. పాత చరిత్రను జ్ఞప్తికి తేవటంతో ఇక ఆ కథ వినకూడదనే వరకు నా ఆలోచన పోయింది. పడుకుని ఆలోచించాలనే కోరిక కలిగింది.

★★★

హావ్ తన కథ ఇలా చెప్పసాగింది.

"అందువల్ల పిల్లల బాధ్యతను మరొకరికి అప్పగించవలసి వచ్చింది. ఈ విషయంలో జిల్లా మహిళా సంఘ కార్యదర్శికి డువాంగ్ చాలా తోడ్పడింది. ఆమె నీకు గుర్తుందా? ఆమె సహాయానికి ధన్యవాదాలు. అన్ని ఏర్పాట్లు ఆమె చేసింది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన లూవా నా పిల్లల బాధ్యత స్వీకరించింది. ఆమె ఒక సైనికుని భార్య. నా జీవితంలో అనేక కష్టాలు అనుభవించాను. అయితే మనం ఇతరులకు సహాయం చేసినప్పుడు ప్రతిగా వారు మనకు సానుభూతి, సహకారం అందిస్తారు. అదే ఇప్పుడు నాకు జరిగింది. క్రితంసారి టువాట్ అత్తయ్య సహాయం చేస్తే ఈసారి లూవా సహాయం చేసింది.

"పిల్లల బాధ్యతను ఇతరులకు అప్పగించిన విషయం గుర్తుకు వచ్చినప్పుడు, ఈ నాటికి కూడా ఉద్రేకం పొందుతాను. లోగడ మాదిరిగానే పెందలాడే గమ్యం చేరుకున్నాను. లూవా ఉంటున్న హీప్‌లో ప్రాంతం చేరటానికి చాలా దూరం ప్రయాణం చేయవలసి వచ్చింది. అర్ధరాత్రి అయినా మేము మార్గం మధ్యలోనే వున్నాం. ఆరోజు సాయంత్రం జంగ్ హీప్‌లో వెళ్తూ పిల్లల బట్టలు మూట కట్టుకుని తీసుకెళ్తున్నానని దారిలో పసిగట్టాడు. చిట్టి థైకి వయసుకు మించిన తెలివి తేటలు వున్నాయి. ఆమెను గురించి నేనేమీ ఆందోళనపడకపోగా చిట్టి థై నాకు చాలా సహాయపడింది.

"రాత్రిపూట ప్రయాణం చేయడం కష్టమైనా అడ్డదారిన ప్రయాణం ప్రారంభించాం. మధ్య అలుపు తీర్చుకోటానికి కూర్చునేవాళ్లం. నేను ఎక్కడ వదిలిపెట్టి పోతానో అని బాబు నా చెయ్యి గట్టిగా పట్టుకునేవాడు. వాడిని హృదయానికి హత్తుకునే దాన్ని. వాళ్ల దగ్గరవున్న ప్రతి నిమిషం నాకు ఎంతో బరువుదించినట్లుగా ఉండేది.

టువాట్ అత్తయ్య ఇప్పుడు ఎక్కడ వుందో తెలుసా? అని అడిగాను.

ఇద్దరూ మౌనంగా వున్నారు.

ఇక అత్తయ్యను ఎప్పుడూ చూడలేరన్నాను.

చిట్టి థై నా చెయ్యి పట్టుకు ఏడ్వసాగింది. పాప తల నిమురుతూ "అత్తయ్యను మీరు ప్రేమిస్తున్నారు కదా?" అన్నా విచారంతో. థై మౌనంగా నిలబడింది. కళ్ల నిండా నీళ్ల తిరిగాయి. మా చుట్టూ ప్రకృతి కూడా గాఢమైన చీకటిలో చలనం లేనట్లు వుంది. ఈ ప్రాంతంలో శత్రువులు రెండు సైనిక శిబిరాలను ఏర్పాటు చేశారు. కానీ గెరిల్లాల దెబ్బకు తట్టుకోలేక ఎత్తేశారు. రోడ్డు అవతల అందుకు గుర్తుగా రెండు రాళ్ల గుట్టలు మిగిలాయి. ఈ సైనిక శిబిరాలు ఎత్తేయడం ఒకరకంగా వారిని శిక్షించడమే. అవి రాక్షసపుండులా తయారయ్యాయి. అనేక మంది చావులకు కారణమయ్యాయి. చనిపోయిన వారిలో మామయ్య, అత్తయ్య కూడా వున్నారు. ఇప్పుడు చావడం వారి వంతు వచ్చింది.

టువాట్ అత్తయ్యను కూడా ప్రేమిస్తున్నావు కదూ? తాతయ్య గుర్తున్నాడా? నాన్న తెలుసా? అత్తయ్య మాదిరిగానే వారు చనిపోయారు.

బాబు కళ్లు చెమ్మగిల్లాయి. థై ఇది గమనించిన వెంటనే తన కళ్లు తుడుచుకుంది. ఆరిందిలా "బాబూ ఏడవకు, జంగ్ మామయ్యను చూడబోతున్నాం. నువ్వు ఏడుస్తున్నావని మామయ్యతో చెప్తా" అన్నది థై.

ఇప్పటికే ఆలస్యమైనందున నేను లేచి నిలబడ్డాను. మళ్లీ వాళ్ల నుండి దూరం కాబోతున్న ఈ సమయంలో వాళ్లలో విచారం పోగొట్టాలనుకున్నా. పాపా పోదాం పద అన్నా.

బాబును వీపు మీద ఎక్కించుకున్నాను. పాప నా వెనుక నెమ్మదిగా నడుస్తోంది. అది ఏప్రియల్ నెల. పంపర పనస చెట్లు బాగా పూచి, ఘాటైన వాసన వస్తోంది. ఏదో ఆశ నన్ను కలిచివేసింది. ప్రతిఘటన పోరాటం అయిపోయిన తర్వాత ప్రశాంతంగా పిల్లల్ని పెంచుకోవచ్చనుకున్నాను. జంగ్ విషయం పాప ఎత్తినప్పుడు నిజంగా నేను ఆయనను గురించే ఆలోచిస్తున్నాను. జంగ్ దగ్గర వున్నప్పుడు తుంటరి తనంగా ఎందుకు వుండదో నాకు తెలియదు. తప్పోఒప్పో నాకు తెలియదు. ఆ విషయం ఈనాటికీ నాకు తెలియదు. హృదయం విప్పి మీతో మాట్లాడుతున్నాను. నవ్వమాకండి...

"నేనెలా నవ్వగలను?" అని చెప్పి, "నా వుద్దేశంలో..." హావ్ కొంచెం ముందుకు వంగింది. నా వుద్దేశంలో అది పాపం కాదని చెప్పాలనుకున్నాను. కాని ఆమె చరిత్ర తెలిసింది కాబట్టి అంత దూరం వెళ్లడం మంచిది కాదనుకున్నాను.

"అది నీమీద ఆధారపడివుంది. అందుకు నిన్నెవరూ నిందించరు. తరువాత ఏం జరిగింది?"

"ఏం లేదు. అతను చాలా మంచివాడు. అతనికీ థై తండ్రికి చాలా పోలికలు వున్నాయి. పని కోసం ఇద్దరం ఒక చోటుకు చేరాం. పరస్పరం కామ్రేడ్స్‌గా చూసుకుంటాం. అతను నాకు ఆప్తమిత్రుడు..."

హావ్ సందిగ్ధంలో పడింది. చెప్పు చివరను ఇసుకలో దూర్చసాగింది. ఇంతలో చంద్రోదయమైంది. తన తెల్లని వెన్నెల సొనతో ఆస్పత్రిని కడుగుతున్నట్లుగా వుంది. చలికాలంలో చంద్రకాంతి కూడా కాంతి హీనమైనట్లుగా వుంది. వెన్నెల పడి హావ్ ముఖం కొంచెం ఎర్రబారినట్లు కనిపించింది. గాలికి తుమ్మెద రెక్కల వంటి ఆమె కురులు కదులాడుతున్నాయి. ముఖంలో విచారం కానవస్తోంది. ఆమె పాత చరిత్రను గురించి ఆలోచిస్తూ ఆమె వంక చూసినప్పుడు ఆశ్చర్యపడకుండా వుండలేకపోయాను. ఆస్పత్రికి వచ్చినప్పుడు చక్కని ముఖం కలిగిన యువతిగా మాత్రమే భావించాను. కానీ ఆమె చాలా అందమైనది. కష్టదినాలు ఆమెలోని ఆ సౌందర్యాన్ని, మృదుత్వాన్ని పోగొట్టలేకపోయాయి.

ఆమె పట్ల ఆశ్చర్యంపోయి సానుభూతి కలిగింది. ఆస్పత్రి మెయిన్‌గేటు అవతల రోడ్‌పై ప్రతి సాయంత్రం చలిగా వున్నా, ప్రేమికులు సంతోషంగా పోతూ వుంటారు.

"ఏంటి ఆలోచిస్తున్నావ్? అడిగింది సంతోషంగా.

(ఇంకావుంది)

అల్లర్లకు అంతం లేదా!

లాయర్ అంకుల్‌కు నమస్కారాలు. నాకో చిన్న సందేహం. మన హైదరాబాద్‌లో మత ఘర్షణలు ఎప్పుడూ జరుగుతూనే ఉన్నాయి. వీటికి అంతం ఉండదా? రాజకీయ అనిశ్చితి వచ్చిన ప్రతీసారి ఇదే తంతు. ఈసారి నల్గురు చనిపోయినట్లు విన్నాను. పరీక్షలు కూడా వాయిదాపడి చాలా ఇబ్బందికి గురైన విద్యార్థులు మళ్లీ ప్రిపేరయి పరీక్షలు రాయాల్సి వచ్చింది. అల్లర్లు చేసే వారికి శిక్ష పడదా? లేదంటే వాళ్లకు శిక్షంటే భయం లేదా? ఏ ఊళ్లలోనూ గొడవలు జరగవు, ఒక్క హైదరాబాద్ పాత బస్తీలో తప్పితే. అక్కడ ఒక వర్గానికి అధిక ప్రాధాన్యత ఉండడమే గొడవకు కారణమంటారా? దీనికి అంతం లేదా? దయచేసి నా సందేహాలు అర్థమయ్యేట్లు తీర్చవలసిందిగా ప్రార్థన.

జ: బాబూ! నువ్వు చిన్న సందేహం అంటూనే చాలా పెద్ద ధర్మ సందేహాలు అడిగావు. కొన్నిటికి మాత్రం నా పరిధిలో (న్యాయం) సమాధానాలు చెప్పగలను. మిగతా సందేహాలకు మన పాలకులే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కానీ వారెప్పుడూ చెప్పరు. నువ్వన్నట్లు గతంలో రాజకీయ అనిశ్చితి వచ్చినప్పుడు అల్లర్లు జరిగాయి. కానీ మన పోలీసుల దర్యాప్తులో ఈసారి రాజకీయ ప్రమేయం లేకుండా రౌడీల వల్ల, కొంతమంది అసాంఘిక శక్తుల వల్ల జరిగినట్లుగా చెబుతున్నారు. సంఘటనలో సామాన్య మానవులు, ఎటువంటి సంబంధమూ లేని వారు చనిపోవడం చాలా బాధ కలిగించే విషయం. రాజకీయ నాయకులు దృఢంగా ఉండి ఎటో ఒక వైపు కొమ్ముకాయకుండా ఉండి అణిచి వేస్తే ఇది ఏమంత పెద్ద విషయం కాదు. కానీ అంతటి ధైర్యం మన పాలకుల్లో రావాలి.

దొమ్మీలు, అల్లర్లు చేసేవారికి 3నుండి 5 సంవత్సరాల వరకు 153ఎ భారతీయ శిక్షాస్మృతి ప్రకారం జైలు శిక్ష పడుతుంది. ఇంకా జరిమానా వేస్తారు. హత్యా నేరానికిగానూ 302 ఐ.పి.సి కింద 10 సంవత్సరాలు గానీ యావజ్జీవ ఖైదు గానీ శిక్ష గానీ విధింపబడుతుంది. మిగతా సమాధానాలు పాలకులు, విజ్ఞులు చెప్పాలి. నేనుకాదు.

జి ఎల్ నరసింహారావు,
అడ్వకేట్,
3-4-778 నుండి 780/1,
బి-002, ప్రసాద్ ఎన్‌క్లేవ్,
బర్కత్‌పురా రోడ్,
హై ద రా బా ద్.

విడిగా బతకాలనుకుంటే...

1999లో నా వివాహం జరిగింది. మాది ప్రేమ వివాహం. ఇప్పుడు ఇద్దరు పిల్లలు. మా ఇద్దరి మధ్య సఖ్యత లేకపోవడంతో రోజూ మా ఇంట్లో నరకం అనుభవిస్తున్నాం. కులాలు కూడా వేరుకావడంతో ఎటువైపు నుండీ పెద్దల సహకారం లేదు. సలహాలు తీసుకునే పరిస్థితి లేదు. ఇద్దరం విడిపోవాలని నిశ్చయించుకున్నాం. దీనికి మేం పెద్దమనుషుల వద్ద విడికాగితాలు తీసుకుంటే సరిపోతుందా? ఇద్దరు పాపల్లో చెరొకరిని పెంచుకోవాలనుకుంటున్నాం. న్యాయసలహా ఇస్తారని ఆశిస్తున్నాం.

ఓ బాధితుడు, రాజమండ్రి.

జ: ప్రేమ వివాహాలు ముఖ్యంగా కులాంతర వివాహాలు చేసుకున్నప్పుడు ఎంతో త్యాగనిరతి, ఓర్పు, ప్రేమను గెలిపించుకోవాలనే పట్టుదల చివరి వరకూ అవసరం. మధ్యలో వదిలేస్తే ఇద్దరి బతుకులూ ఎడారిగానే మిగిలిపోతాయి. ప్రేమ వివాహాలు అంటేనే పెద్దలు దూషించే పరిస్థితి వస్తుంది. మీరిద్దరూ మరొక్కసారి ఇలాంటి పరిస్థితి ఎందుకొచ్చిందని గతంలోకి వెళ్లి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మీది పరిపూర్ణమైన ప్రేమ అయితే మీరు విడిపోవాలనే ఆలోచన విరమించుకుంటారు. ఆకర్షణే అయితే ఇలా మధ్యలోనే విడిపోతారు. ఇప్పుడు మీరే కాకుండా మీ పిల్లల భవిష్యత్తు కూడా ఆగం చేసినవారౌతారు. మీరిద్దరూ ఎలాగూ కలిసి బతకలేకపోతున్నారు. ఒకటిగా పుట్టి, ఒకటిగా బతుకుతున్న ఇద్దరు పిల్లల్ని విడదీసి పంచుకోవడం అన్నది చట్టం ఒప్పుకోవచ్చు కానీ అది భావ్యం కాదు. మీరిద్దరూ అదే నిర్ణయించుకుంటే న్యాయవాదిని కలవండి. 13బి హిందూ వివాహ చట్టం ప్రకారం 6 నెలల్లో విడికాగితాలు పొందవచ్చు. మరొక్కసారి ఆలోచించండి. ★

ఐదు తలల పాము

ఐదు తలల నాగుపాము ఉంటుందని కథల్లో విన్నాం. పెద్దవాళ్లు చెబుతుంటే విన్నాం. కథల్లో చదివాం. సినిమాల్లో చూశాం. అంతేకానీ ప్రత్యక్షంగా ఐదు తలల పామును చూసి ఎరగం. అయితే ఆదిలాబాద్ ఉట్నూర్ వెళ్తే ఐదు తలల పామును చూడొచ్చు.

ఏంటి అంతగా ఆశ్చర్యపోతున్నారు? మా మాటలు నమ్మశక్యంగా లేవా! మీరు విన్నది నిజమేనండీ.

అంత అబద్ధమనిపిస్తే ఈ ఫొటోలు చూసైనా నమ్ముతారా! ఐదు తలల పామును గత నెల 15న బెంగుళూర్‌లోని ఇన్‌ఫోసిస్ క్యాంపస్‌లో దొరికింది. రెండు మీటర్ల పొడవుంది. దీంతో ఆ క్యాంపస్‌లోని వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. క్షుణ్ణంగా పరిశీలిస్తే పాము పడగ విప్పినప్పుడు ఐదు తలలు కనిపిస్తాయి. అనంతరం అక్కడి ఫారెస్టు అధికారులకు క్యాంపస్ సిబ్బంది సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులు పామును సంరక్షణార్థం అక్కడి వన్యప్రాణుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఆ ఫొటోలే ఇవి.





సినిమా కబుర్లు

రిస్క్ అంటే భయం

బాల నటుడు భరత్ గురించి ప్రత్యేకంగా ఉపోద్ఘాతం ఇవ్వాలా చెప్పండి. 'పంచతంత్రం', 'పోకిరి' వంటి విజయవంతమైన చిత్రాలతో అటు పిల్లలను ఇటు పెద్దలను ఆకట్టుకున్న పిడుగు. తన తొలిచిత్రంలో చేసిన నటనకు కమల్‌హాసన్ అంతటి నటుడే ఆశ్చర్యపోయాడనుకోండి. అలాంటి గడుగ్గాయికి ఇప్పుడు ఇప్పుడు 14 ఏళ్లు. ఆఫ్సాన్ మెమోరియల్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. తన క్లాసు పిల్లలందరిలోకి చిన్నవాడు. అయితే ప్రస్తుతం శీను వైట్ల తాజా చిత్రంలో కొత్త అవతారం ఎత్తబోతున్నాడు.

బొద్దుగా ముద్దుగా వుంటే భరత్ తమిళ పిల్లవాడు. మొట్టమొదటిసారిగా తనకు మూడున్నరేళ్ల వయసులో మొహానికి రంగు పులుముకొని కెమెరా ముందుకొచ్చాడు. ఈటీవీలో ప్రసారమైన 'మాతృదేవత' సీరియల్‌లో తళుక్కున మెరిశాడు. తన తొలి చిత్రంతోనే కమల్‌హాసన్‌తో కలిసి నటించే చాన్స్ కొట్టేశాడు. ఓ స్కూల్లో జరిగిన ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌లో చిన్నారి భరత్ పాల్గొన్నాడు. అలా ఏవీఎం స్టూడియో వారి దృష్టిలో పడ్డాడు. కమల్ సినిమాలో బుక్కయ్యాడు.

చిన్నవాడైనా నటనకు సంబంధించి, భారీ డైలాగులకు సంబంధించి తనవైపు నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకుండా చూసుకుంటాడు. పాత్రకు అవసరమైతే గుండు చేయించుకోడానికి కూడా వెనుకాడడు. ఓసారి కరుణానిధి క్యారెక్టర్ చేయాల్సి వచ్చినప్పుడు దాదాపు గుండు చేయించుకోవాల్సి వచ్చింది. ఏమాత్రం గొడవచేయకుండా చక్కగా చేయించుకున్నాడు. తన తండ్రి రాసిన పెద్ద పెద్ద డైలాగులను చెప్పేశాడు. అప్పుడే కాదు. ఇప్పటికీ ఎంత పెద్ద డైలాగులనైనా తడబడకుండా చక్కగా చెప్పేస్తాడు.

భోజనానంతర షూటింగ్‌కి మాత్రం నాలుగేళ్ల వయసులో భరత్ కాస్త ఇబ్బంది పడిపోయేవాడు. డైరెక్టర్ అంకుల్ అనుమతితో ఓ పక్కన కునుకుతీసేవాడు. షాట్ రెడీ అనగానే చకచకా లేచి కెమెరా ముందుకు రావడానికి సిద్ధమయ్యేవాడు.

ఇప్పటి వరకు భరత్ అనేక చిత్రాల్లో నటించినా 'పోకిరి'లో ఇలియానా తమ్ముడిగా మంచి గుర్తింపు పొందాడు. ప్రతిరోజూ క్యారియర్‌లో ఉప్మా తీసుకెళుతూ కామెడీ పండించాడు. కానీ నిజజీవితంలో మాత్రం తనకు ఉప్మా అంటే ఇష్టం లేదంటాడు. 'ఉఫ్...ఉప్మానా' అనేస్తాడు. పులిహారను చూస్తే నోరూరిపోతుందంటాడు.

ఎక్కువ సమయాన్ని ఇన్‌డోర్ గేమ్స్‌కే కేటాయిస్తాడు. పెయింట్ బ్రష్షులు, రంగులు తీసుకొని బొమ్మలు వేస్తాడు. మట్టితో బొమ్మలు చేస్తాడు. ఇంట్లో కూడా పెద్దగా అల్లరి చేయడు. బుద్ధిగా వుంటాడు.కానీ ఒక్క విషయంలో మాత్రం ఏమీ చేయలేకపోతున్నామని భరత్ తల్లి కూడా బాధపడుతుంటారు. అదేనండీ! ఇండోర్ గేమ్స్ నుంచి దూరంగా కాస్త బయటి ఆటలవైపు మనసు మళ్లించేలా చేయడం వాళ్లకు కష్టమైపోతోంది. రెండు రోజులు ఎటైనా బయటకు తీసుకెళ్తే చాలు. మూడో రోజు షూటింగ్‌లో పాల్గొనాల్సి వుంటుంది. ఇంక అవన్నీ ఎక్కడ కుదురుతాయి? ఇక నుంచి మాత్రం తన ఆరోగ్యం గురించి కొంచెం సీరియస్‌గానే జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె భావిస్తున్నారు.

భరత్ తాజాగా శీను వైట్ల చిత్రంలో కొత్త గెటప్‌లో కనిపించబోతున్నాడు. తమాషా ఏంటంటే ఈ బాలనటుడు ఇప్పటి వరకు వైట్ల ప్రతి సినిమాలో నటించాడు. ఒక్క 'అందరివాడు'లో తప్ప.

"భరత్ అప్పటికి చాలా చిన్నవాడు. ఈసారి అతణ్ణి విభిన్నంగా చూయించబోతున్నాను. మహేష్‌బాబుతో నా కొత్త చిత్రంలో టీనేజర్‌గా చూయించబోతున్నాను. భవిష్యత్తులో తను మంచి హాస్యనటుడు అవుతాడు" అని శీను వైట్ల చెప్తున్నాడు.

'బిందాస్'లో భరత్‌ను డైరెక్ట్ చేసిన వీరు పోట్ల కూడా భరత్‌కు మంచి కితాబు ఇచ్చేశాడు. భరత్ పసివయసులోనే పరిపక్వతగల పిల్లవాడంటున్నాడాయన. "తన షాట్ అయిపోయినప్పుడు విశ్రాంతి తీసుకోమని చెప్పినా 'ఫర్లేదు అంకుల్' అంటూ అలా నిలబడిపోతాడు. పెద్దల పట్ల గౌరవం, చేస్తున్న పని పట్ల నిబద్ధత... వుంది" అంటున్నాడు.

అంతేకాదు! ఈ గడుగ్గాయి దగ్గర రచనా నైపుణ్యం కూడా వుంది. ఓసారి వాళ్ల తాతయ్య చనిపోయినప్పుడు ఆయన మీద ఒక కవితే రాసేశాడు. మరి తాతతో వున్న సాన్నిహిత్యం అలాంటిది. అంత బాధలో వుండికూడా తను చేస్తున్న చిత్రంలో హాస్యాన్ని చక్కగా పండించేశాడు.

షూటింగ్ సమయంలో మంచి ఉత్సాహంగా ఉల్లాసంగా వుంటాడు. సెట్‌మీద ఖాళీ సమయాల్లో బొమ్మలు వేస్తుంటాడు. భరత్ ఎంత చక్కగా బొమ్మలేస్తాడో తెలియాలంటే ఒక విషయాన్ని గుర్తుచేయక తప్పదు. నాగార్జున, శ్రీహరి నటించిన 'కింగ్' సినిమా చూసే వుంటారుగా. ఆ చిత్రంలో శ్రీహరి వేసిన బొమ్మలు గుర్తు తెచ్చుకోండి. గంటల తరబడి మనుషులను నిలబెట్టి జంతువుల బొమ్మలు వేసేవాడు. ఆ బొమ్మలు చిత్రంలో మంచి కామెడీ పండించాయనే అనుకోవాలి. నిజానికి వాటిని వేసింది శ్రీహరి కాదు. మన భరత్. మరో విశేషమేంటంటే... దర్శకుడు వీరు పోట్లకు మనవాడు ఒక బొమ్మ వేసి ఫ్రేమ్ కట్టించి మరీ బహూకరించి ఇచ్చాడు.

ఇంత వత్తిడిలోనూ, స్కూలుకు డుమ్మాలు కొడుతూ కూడా మంచి మార్కులే సంపాదిస్తుంటాడు. వైద్యుడు దైవం తర్వాత దైవంతో సమానమని తల్లి చెప్పిన మాటలు భరత్‌లో బాగా నాటుకున్నాయి. అందుకే పెద్దయ్యాక డాక్టర్ కావాలని అనుకుంటున్నాడు.

హీరో కావడం మాత్రం తనకు ఇష్టంలేదు. ఎందుకంటారా! 'రిస్క్ అంటే భయం నాకు' అంటాడు. మరి హీరో అంటే హీరోయిన్‌తో ప్రేమ సన్నివేశాల్లో పాల్గొనడమే కాదుగా. కష్టమైన ఫైట్లు కూడా చేయాల్సి వుంటుందికదా.

★

చూద్దామా

ప్రాచీన కట్టడం గండికోట



101 బురుజులతో నిర్మితమైన గండి కోట ఎంతో సుందరంగానూ, దృఢంగానూ ఉంటుంది. చుట్టూ నాలుగు మైళ్ల విస్తీర్ణంతో విశాలంగా ఉంటుంది. 40 అడుగుల ఎత్తుగల ఈ కోట అతి గంభీరంగా కనిపిస్తుంది. శత్రు దుర్భేద్యంగా ఉంటుంది. ఈ కోటలో 15, 16 శతాబ్దాలలో నిర్మించిన అనేక దేవాలయాలు, మసీదులు ప్రాచీన శిల్పకలా నైపుణ్యాన్ని తెలియజేస్తాయి. చుట్టూ కొండలు, దట్టమైన అడవులు, ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో చాలా అందంగా ఉంటుంది. తనకెవరడ్డంటూ కొండలను సైతం చీల్చుకుంటూ పెన్నా నది ఉరకలు వేసే చోట ఉన్న ఈ కోట పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది.

పెన్నా నదికి కుడి ఒడ్డున ఉన్న అతి ప్రాచీన కట్టడమే గండి కోట. ఇది కడప జిల్లాలోని జమ్మలమడుగుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గండి కోట అనే చిన్న గ్రామంలో ఉంది. ఇది కడప జిల్లాలోని చారిత్రక ప్రదేశాల్లో ముఖ్యమైనది. శత్రువులు చొరబడకుండా పటిష్టంగా నిర్మించిన ఈ చోట ప్రకృతి రమణీయమైన దృశ్యాలకూ కొదవలేదు.

గండి కోట అనే పేరులోనే 'గండి', 'కోట' అనే రెండు పదాలున్నాయి. అత్యంత వేగంతో, అమితమైన ఉత్సాహంతో పరిగెడుతున్న పెన్నా నది ధాటికి నిశ్చలంగా ఉన్న కొండకు గండి ఏర్పడింది. ఈ కొండమీద ఒక కోటను నిర్మించడంతో ఆ కోటకు 'గండికోట' అనే పేరు వచ్చింది. శరవేగంతో దూసుకుపోయే ఈ నది తీవ్రతకు ఏర్పడిన గండి దాదాపు నాలుగు మైళ్ల పొడవుంటుంది. ఈ గండి కోట నిర్మాణానికి సంబంధించి అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. అయితే పెన్నా నది అసలంత వేగంగా దూసుకుపోవడానికి కూడా ఓ పురాణ గాథ ప్రచారంలో ఉంది.

పెన్నా పినాకినిగా...

అగస్త్య అనే మహాముని శాపానికి గురైన పెన్నా నది కలుషితమైందట. దీంతో ప్రజలు ఆ నదిలోని నీటిని ముట్టుకోవడం మానేశారు. దీనికి కలత చెందిన పినాకిని కేశవ స్వామికి తపస్సు చేసిందట. ఆమె తపస్సుకు ప్రసన్నుడైన కేశవస్వామి ప్రత్యక్షమై నందికొండ సమీపంలోని తన పాలసన్నిధిలో పెన్నను మళ్లీ ఉద్భవించమని ఆజ్ఞాపించాడు. ఆ దిశలో ప్రవహించడం వల్ల అనేక రుష్యాశ్రమాలు ఎదురౌతాయని, అందువల్ల అగస్త్య ముని శాపానికి విమోచన కలుగుతుందని విష్ణుమూర్తి చెప్పాడట. ఆ విధంగా జమ్మలమడుగులోని కొండకు గండి కొడుతూ పెన్నా ఉత్సాహంతో ఉత్తర దిశగా పరుగులు తీస్తూ ప్రవహించి శాపవిమోచన పొందుతుంది. అప్పటి నుంచి ఈ నదిని పినాకిని నది అని కూడా అంటారు.

గండి కోట నిర్మాణానికి సంబంధించి కూడా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో కాకమహారాజులు ఈ కోటను నిర్మించాడనే కథ ఎక్కువగా ప్రచారంలో ఉంది. శాలివాహన శకం 1213 ప్రాంతంలో కాకమహారాజులు అనే ఆయన బొమ్మనపల్లిని పాలించేవాడు. ఆయన ఒక రోజు తన అనుచరులతో కలిసి వేట కోసం గండికోట ప్రాంతానికి వెళ్లాడు. ఆయనకు ఆ స్థలం బాగా నచ్చింది. ఆ కొండ కోట నిర్మాణానికి ఎంతో అనువుగా ఉందనీ, అక్కడ కోటను నిర్మిస్తే ఆ చుట్టు పక్కల గ్రామం వెలసి సుసంపన్నంగా, ఎంతో

ఆయనకు ఆ స్థలం బాగా నచ్చింది. ఆ కొండ కోట నిర్మాణానికి ఎంతో అనువుగా ఉందనీ, అక్కడ కోటను నిర్మిస్తే ఆ చుట్టు పక్కల గ్రామం వెలసి సుసంపన్నంగా, ఎంతో వైభవంగా కళకళలాడుతుందనీ జ్యోతిష్కులు శెలవిచ్చారు. దాంతో కాకమహారాజులు అక్కడ కోటను నిర్మించాలని అనుకున్నాడు. వైకుంఠశుద్ధ పంచమి రోజున కోట నిర్మాణానికి శంకుస్థాపన జరిపాడు. అతితక్కువ వ్యవధిలోనే అక్కడ గండికోట ఆవిర్భవించి దుర్భేద్యమైన కోటగా పేరు తెచ్చుకుంది.







పెన్నా నది



గండికోట రాజదర్బారు

వైభవంగా కళకళలాడుతుందనీ జ్యోతిష్కులు శెలవిచ్చారు. దాంతో కాకమహారాజులు అక్కడ కోటను నిర్మించాలని అనుకున్నాడు. వైకుంఠశుద్ధ పంచమి రోజున కోట నిర్మాణానికి శంకుస్థాపన జరిపాడు. అతితక్కువ వ్యవధిలోనే అక్కడ గండికోట ఆవిర్భవించి దుర్భేద్యమైన కోటగా పేరు తెచ్చుకుంది.

గండికోట అనేక ఆలయాలకు నిలయం. విజయనగర మహాసామ్రాజ్యాన్ని హరిహర బుక్కరాయలు పాలిస్తున్న కాలంలో ఆయన కాశీ యాత్ర చేసి తిరిగి వస్తున్న సమయంలో దారిలో అనేక ఆలయాలను నిర్మించాడు. అందులో మాధవస్వామి ఆలయం ఎంతో ప్రముఖమైనది. కాశీ తిరుగు ప్రయాణంలో రాజు గండిపేటలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఆయనకు ఒక కల వచ్చిందట. ఆ కలలో మాధవస్వామి దర్శనమిచ్చి ఈ ప్రదేశం అతి పవిత్రమైందనీ, ఇక్కడ తనకు ఒక ఆలయాన్ని నిర్మించాలని ఆదేశించినట్టు అనిపించచదట. ఆ విధంగా నిర్మించినదే ఈ మాధవస్వామి ఆలయం. ఆలయం నిర్మాణంతో పాటు, ఆ స్వామి నిత్యారాధన కోసం అర్చకులను ఏర్పాటు చేసి వారి జీవనానికి మాన్యాలు కూడా ఏర్పాటు చేసినట్టు అక్కడి శిలాఫలకాల మీద ఉంటుంది.

ఒక్క మాధవస్వామి ఆలయంతోనే ఆగక గండికోట లోపల, వెలుపల కూడా అనేక ఆలయాలను నిర్మించారు. రఘునాథ ఆలయం, శివాలయం, భైరవుని ఆలయం, వీరభద్ర దేవళం మొదలైన దేవాలయాలెన్నో ఉన్నాయి. పెన్నా నది ఒడ్డున వెంకటరమణాలయం కూడా ఉంది. ప్రస్తుతం ఈ ఆలయాలన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. రాయల కాలం తర్వాత గండికోట మహమ్మదీయుల పరమైంది. ఆ సమయంలో గండికోట ఆలయాలన్నీ ధ్వంసమయ్యాయి. నేడు కొన్ని ఆలయాల్లో మూల విగ్రహాలే కనపడవు.

ఈ కోటలోని శిల్పకళా వైభవం ఎంతగానో అలరిస్తుంది. ఆలయ గోడల మీద నృత్యభంగిమలలో ఉన్న స్త్రీమూర్తులు, ఇతర దేవతా శిల్పాల్లో జీవకళ ఉట్టిపడుతుంది. అవి నాటి శిల్పకళానైపుణ్యానికి నిదర్శనంగా ఉన్నాయి.

గోల్కొండ నవాబు ప్రతినిధిగా గండికోటను పాలించిన మీర్ జుమ్లా హయాంలో ఇక్కడి దేవాలయాల విధ్వంసకాండ నిరాటంకంగా జరిగిపోయింది. ఈ ఆలయాల స్థలంలో జుమ్మా మసీదును నిర్మించారు. ఈ మసీదు నాటి సుందరమైన కట్టడాల్లో ఒకటి. దీనికి మూడు ప్రవేశద్వారాలున్నాయి. మసీదు ముందు భాగంలో భక్తులు నమాజు చేసుకోవడానికి వీలుగా విశాలమైన అరుగు ఉంది. అక్కడ అనేక యుద్ధాలు జరిగాయి. నేటికీ అక్కడ ఉన్న ఫిరంగులే అందుకు సాక్ష్యం.

అగస్త్య కోన

గండి కోట నుండి సుమారు 3 మైళ్ల దూరంలో అగస్త్య కోన ఉంది. అక్కడ అగస్త్యేశ్వర స్వామి ఆలయం కూడా ఉంది. ఈ ఆలయంలో గల లింగాన్ని అగస్త్య మహామునే ప్రతిష్ఠించాడని అంటారు. నేటికీ ప్రతిసంవత్సరం కార్తీక మాసంలో ఉత్సవాలు జరుగుతుంటాయి. ప్రతి కార్తీక సోమవారం రోజు చుట్టు పక్కల నుంచి అనేకమంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుని, పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. కార్తీకమాసం చివరి సోమవారం రోజు ఇక్కడ ఆలయం వారు భక్తులకు ఉచిత భోజనాలను ఏర్పాటు చేస్తారు. ఈ అగస్త్యకోన చుట్టుపక్కల ప్రకృతి సౌందర్యాన్ని ఎంతగానో ఆస్వాదించొచ్చు.

గండికోటలోనే వెలిసిన ఎల్లమ్మ జాతర ఎంతో వైభవంగా, కోలాహలంగా జరుగుతుంది. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధపాడ్యమి, విదియలలో రెండు రోజులు ఈ జాతరను నిర్వహిస్తుంటారు.

రాయల కొలను

గండికోటలో అనేక దిగుడు బావులుండేవి. అక్కడ రాయల చెరువు అని ఒక కొలను ఉండేది. అందులో ఎప్పుడూ నీరు ఉండేది. అందువల్ల చుట్టుపక్కల ప్రాంతాలు ఎల్లప్పుడూ సస్యశ్యామలంగా ఉండేవి. ఈ కోనేటి నీరు చల్లగా ఉంటాయి. అందుకే ఇక్కడికి వచ్చినవారు ఆ నీటిని తప్పక రుచి చూస్తారు.

గండికోటకు వెళ్లడానికి జమ్మలమడుగు నుంచి బస్సు సౌకర్యం ఉంది.

★



మాధవస్వామి ఆలయరం

మీ నవ్వే... మీకు టానిక్...

"అబ్బ...

ఇలా పొట్ట పట్టుకొని...కళ్లెంట నీళ్లొచ్చేలా నవ్వి ఎన్ని రోజులైందో?"

"నవ్వీ నవ్వీ బుగ్గలు నొప్పి పుడుతున్నాయి. ఇక నవ్వడం నావల్ల కాదు"

అన్న మాటలు మీ నోటెంట వచ్చి ఎన్ని రోజులైంది? ఎప్పుడో చిన్నప్పుడు అలా నవ్వినట్టు గుర్తుందిగానీ ఇప్పట్లో లేదా?! అలా అయితే ఎలాగండీ. మనిషన్నాక కూసింత హాస్యరస పోషణ వుండొద్దూ. ఏదో ఎప్పుడో సినిమా హాలుకెళ్లినప్పుడు ఏ బ్రహ్మానందమో, సునీలో నవ్విస్తేనే నవ్వుతామంటే ఎలా? మనిషి హాయిగా మనసారా చేయగలిగే పని నవ్వడం. పైగా నవ్వడం వల్ల అసలు వయసు కన్నా చిన్నగా కనిపిస్తారని కూడా అంటుంటారు. అలాంటి సంజీవనిని నిర్దాక్షిణ్యంగా మన నుంచి దూరం చేస్తే ఎలా? ఒక్క మాటలో చెప్పకోవాలంటే మన నవ్వే మనకు టానిక్. దాన్ని చేజార్చుకుంటే మనకన్నా మూర్ఖుడు మరొకడుండడు. ప్రపంచ నవ్వుల దినోత్సవ సందర్భంగా నవ్వుల పూదోటలో విహరిద్దాం రండి అలా అలా...

ప్రతి మనిషికీ - ఎక్కడ పుట్టినా, మరెక్కడ పెరిగినా... అర్థం అయ్యే భాష నవ్వు. బహుశా ప్రతి ఒక్కరి నవ్వులోనూ అర్థం కూడా ఒకటే. నవ్వడం మనం నేర్చుకోనక్కరలేని భాష. పుట్టుక నుండే మనకు నవ్వు వస్తుంది. మరో విశేషం ఏంటంటే, నవ్వు మనకు తెలీకుండానే వస్తుంది. వచ్చిన నవ్వును బలవంతంగా మనం ఆపగలమే కానీ, బలవంతంగా నవ్వలేం (ఇప్పుడు చాలా మంది తంటాలుపడి పడీ పడీ నవ్వుతుంటారనుకోండి, రాకపోయినా). ఆడాళ్ల నోళ్లలో నువ్వులు నానతాయో లేవో గానీ, అందరి నోళ్లల్లోనూ నవ్వులు నానలేవు. అందరి ముందూ నవ్వడానికి మొహమాటపడే మహామహులు కూడా పక్కకి వెళ్లి నవ్వును కక్కేయవలసిందే.

పుట్టుకతో వచ్చిందే...

సకల జీవరాశిలో మానవుడికో - మానవుడికి మాత్రమేనో- నవ్వుకునే, నవ్వే గుణమూ, లక్షణమూ అబ్బాయనుకోవడం మన అజ్ఞానం. చాలా గుణాలలాగే, నవ్వు కూడా మనకు మన పూర్వీకులైన మహా వానరాల నుండి వారసత్వంగా వచ్చిందని ఆలస్యంగా తెలుసుకున్నాం, నవ్వుకున్నాం. చింపాంజీలను, గొరిల్లాలను చక్కిలిగిలి పెడితే (పెట్టగలిగితే), అవీ ఎంచక్కా నవ్వుతాయి. కానీ మనలా 'హ హ హ' అనే టైపులో మాత్రం కాదు. వాటి నవ్వు శబ్దాలు వాటివి. ఆ శబ్దాలే మానవ నవ్వు మూలాలు, అయితే నవ్వు నేర్చుకున్న విద్య కాదు. జన్మత: లభించిన లక్షణం. పుట్టు అంధులు, బధిర శిశువులు కూడా ఎంచక్కా నవ్వుతారు.

నవ్వు గురించి నాలుగు మాటలు

ఒక మనిషి ఎంత సంతోషంగా వున్నాడో తెల్సుకోడానికి అతను రోజుకు ఎన్నిసార్లు మనస్ఫూర్తిగా నవ్వుతున్నాడో లెక్కవేస్తే సరిపోతుంది. ఒంటరిగా వున్నప్పటికంటే జనంలో వున్నప్పుడు మనం 30 రెట్లు ఎక్కువగా నవ్వుతాం. తోడెవరూ లేకుండా సినిమాల్లో కామెడీ సన్నివేశాలు చూసినా, మంచి జోక్ చదివినా మనసుకు ఆహ్లాదకరంగా వుంటుందే తప్ప నవ్వు ముంచుకురాదు. నిజజీవితంలో మనకు నవ్వు తెప్పించే సందర్భాలు సినిమాల్లో కామెడీ సన్నివేశాలంత పదునుగా వుండవు. ఎదుటివారి ముఖకవళికలు, కామెంట్లు, చేష్టలు చాలు మనం పగలబడినవ్వేందుకు. మరో ముఖ్యమైన విషయం ఒకటుంది. ఆడవాళు మగవాళ్లకంటే ఎక్కువసార్లు నవ్వుతారట. మనసు దోచుకున్న మగువను నవ్వించడానికి మగవాళ్లు నానా తంటాలూ పడితే తమకు నచ్చిన వాడి సన్నిధిలో అతివలు అధికంగా నవ్వులు కురిపిస్తారట. కలిసి వున్న సమయంలో 62 శాతాన్ని



హాస్యరసంలో ముంచెత్తే మగవాళ్లను అమ్మాయిలు ఇష్టపడితే, తమ హాస్యంలో కనీసం 65 శాతానికి స్పందించే అమ్మాయిలను అబ్బాయిలు కోరుకుంటారని అధ్యయనాలు తెలుపుతున్నాయి. అడల్ట్ జోకులు పురుషులకు చక్కిలిగింతలు పెడితే, మహిళలు మాత్రం మంచి హాస్యరసం ఒలికే జోకులకే ఓటేస్తారట. తమ మీద తామే జోకులు వేసుకుని నవ్వుకోగలిగేవాళ్లకు ఆత్మవిశ్వాసం అత్యధిక స్థాయిలో వుంటుంది. తమ మీద ఇతరులు పేల్చే జోకుల్ని తట్టుకోలేని వాళ్లు ఆత్మన్యూనతతో బాధపడుతున్నట్టే లెక్క. సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎక్కువగా వున్న ఉద్యోగులే ఎక్కువ సామర్థ్యంతో పని చేయగలుగుతారని మరో అధ్యయనం తేల్చి చెప్తోంది.

మొదటి స్థానం దానికే

అసలు మన దేశంలో హాస్యానికి మొదటి నుంచి ప్రముఖ స్థానం వుంది. రాజాస్థానాలలో విదూషకులు అందుకే వుండేవారు. బీర్బల్, తెనాలి రామకృష్ణ వంటి వారి కథలు గిలిగింతలు పెడతాయి. జానపద గీతాల్లోనూ, హాస్యరసం పుష్కలం. అప్పటిద్దాకా ఎందుకు! నవ్వడం ఆరోగ్యానికి చాలా మంచిదని నేటి డాక్టర్లు సైతం చెబుతున్నారు. హాస్యం హాయిగా వున్నామనే భావన కలిగిస్తుంది. క్రమంగా ప్రపంచమంతటా హాస్యాన్ని, నవ్వును చికిత్స సాధనంగా గుర్తిస్తున్నారు. అమెరికా, బ్రిటన్ ఇతర పాశ్చాత్య దేశాలలో ఆస్పత్రులకు అనుబంధంగా నవ్వుల ఆస్పత్రులు ఏర్పడ్డాయి. వీటిలో హాస్య చిత్రాలు, వీడియోలు చూపిస్తారు. పెద్ద కారణం లేకుండా నవ్వడం పిచ్చి అనుకుంటే మీరు పొరబడినట్టే. కడుపుబ్బ నవ్వేవారు ఒత్తిడి తగ్గించుకుని ప్రపంచంలో హాయిగా సర్దుకోగలరన్నమాట. తమ సమస్యలను, సంకోచాలను పక్కనబెట్టి హాయిగా నవ్వడం ద్వారా మెరుగైన జీవనానికి సాగిపోతారన్నమాట.

హాస్య ప్రియత్వం తగ్గుతోందా!

నవరసాల్లో ఒకటి హాస్యం. కానీ ఒక రకంగా అది మన జీవితాల్లో తగ్గిపోతోందనిపిస్తోంది. కోపం..ముభావం...ఆవేశం...అసంతృప్తి...ఎప్పుడూ మన వెన్నంటి వుండేవే. సంవత్సరాలు, దశాబ్దాలు గడుస్తున్నా వీటినుంచి మనిషి బయటపడలేకపోతున్నాడు. దానికి ఒకటి రెండూ కాదు. ఎన్నో కారణాలు. జీవితంలో పెరిగే వేగం, ఒత్తిడి, పోటీ, సమస్యలు ... ఇంకా ఎన్నెన్నో. ఇవే మనషిని నవ్వుకు దూరం చేస్తున్నాయి. అసలు నవ్వడమే మర్చిపోయేలా చేస్తున్నాయి. చార్లీచాప్లిన్ నుంచి బ్రహ్మానందం వరకు హాస్యనటులు నవ్వులు పండిస్తున్నా జీవితంలో నవ్వులు కరువవుతున్నాయి. ఆరోగ్యకమైన హాస్యం ఇవాళ్టి జీవితంలో లోపిస్తోంది. అవసరాలు తీర్చుకునేందుకు, డబ్బు సంపాదించేందుకు చేసే పరుగుపందెంలో ఏళ్లు గడిచిపోతున్నాయి.

కాసేపు నింపాదిగా, హాయిగా గడిపే తీరిక వుండడంలేదు. ఇలా గడిపితేనే కదా, మనుషుల మధ్యన మాటా ముచ్చట వుండేది, సంభాషణ కొనసాగేది. అప్పుడే హాస్యం పుడుతుంది. సంభాషణలో చతురోక్తులకీ, ఛలోక్తులకీ చోటు వుంటుంది. కానీ అలాంటి అవకాశం, తీరిక ఇప్పుడు లేదు మరి. ఇంతేకాక ఎప్పుడూ ఏవో చికాకులతో, చింతలతో, అర్థం లేని లక్ష్యాల సాధనకోసం పరుగులాటలో ఒత్తిడిలో కాలం గడిపేస్తుంటారు. ఇలా

నవ్వుల రోజు

ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని మొదట్లో జనవరి రెండో ఆదివారం నాడు జరుపుకునేవారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలలో జనవరిలో చలి వాతావరణముంటుంది కాబట్టి ఈ తేదీని మార్చాలని హాస్య ప్రియులు కోరారు. దాంతో లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వాళ్లు ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే మొదటి ఆదివారం నాడు జరపాలని నిర్ణయించారు. మొట్టమొదటి నవ్వుల దినోత్సవాన్ని 1998 జనవరి 11వ తేదీన ముంబయిలో నిర్వహించారు. దీనికి 1200 మంది హాజరయ్యారు. భారతదేశం వెలుపల మొదటిసారిగా కోపెన్‌హాగెన్‌లో నిర్వహించారు. జనవరి 9వ తేదీన జరిగిన ఈ దినోత్సవానికి పదివేలమంది హాజరయ్యారు. ఈ ఉత్సవ విశేషాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కూడా నమోదయ్యాయి. 2004 మే 2వ తేదీన స్విట్జర్లాండ్ రాజధాని నగరంలో ఈ ఉత్సవం జరిగింది. ఆ దేశపు పార్లమెంటు చుట్టూ నవ్వుతూ ప్రదక్షిణ చేయడం ఈ ఉత్సవంలో విశేషం. నవ్వడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని, ప్రపపంచశాంతి ఈ దినోత్సవ నిర్వహణ పరమార్థమని నిర్వాహకుల అభిప్రాయం

నవ్వు తెప్పించే వాయువు

నవ్వు రకరకాల పరిస్థితుల కారణంగా పుడుతుంది. కానీ నైట్రస్ అనే వాయువు వల్ల కూడా వస్తుందని చెబుతారు. వాస్తవానికి ఆ వాయువు నొప్పి తెలియకుండా చేయగల సెడేటివ్. క్లోరోఫాం కంటే ముందే కనుగొనబడినది, దాని కంటే తక్కువ శక్తి కలిగి ఉంటుంది. దానిని సాధారణంగా డెంటిస్ట్‌లు ఉపయోగిస్తారు. అయితే ఆ వాయువు పీల్చినవారు కొద్దిసేపు గాల్లో తేలినట్టు ఒకరకమైన ఆనందంలో ఉంటారు. కొంతమంది చిరునవ్వులు నవ్వితే, కొద్దిమంది గట్టిగానే నవ్వుతారు. అందుకే నైట్రస్ ఆక్సైడ్‌ని లాఫింగ్ గ్యాస్ అంటారు. నైట్రస్ ఆక్సైడ్‌ను జోసఫ్ ప్రీస్ట్లీ 1772లో తొలిసారి తయారు చేశాడు. ఆ తరువాత హంఫ్రీ డేవి 1800లో ఆ వాయువు తాలూకు నొప్పి తగ్గించే గుణాన్ని కనుగొన్నాడు. అయితే డేవి కనుగొన్న నలభై నూరేళ్లకుగానీ ఆ వాయువును అనస్తీషియాకి వాడలేదు. అంతకుముందే 1799లో ధనిక బ్రిటీష్ వర్గాలలో ఆ వాయువు లాఫింగ్ గ్యాస్‌గా ప్రాచుర్యం పొందింది. వారికి ప్రత్యేకంగా లాఫింగ్ గ్యాస్ పార్టీలు జరుగుతుండేవి. ఆ వాయువు కలిగించే తాత్కాలిక అలౌకిక ఆనందానుభూతి కోసం డబ్బున్నవారు బారులు తీరేవారు. నైట్రస్ ఆక్సైడ్‌ను దీర్ఘకాలం వాడితే దానికి బానిస అయ్యే ప్రమాదం ఉంది. అలాగే ఆరోగ్య సమస్యలూ తలెత్తుతాయి.



ఎందుకు నవ్వుతాం?

మన నవ్వుకు కారణాలు ఏమిటో మనకు తెలిసినా, అసలు నవ్వు ఏ విధంగా మెదడులో పుడుతుందో ఎవరికీ తెలియదు. నవ్వుతున్నప్పుడు మన ముఖ కవళికలు మారతాయి. విచిత్రమైన శబ్దాలూ వస్తాయి. మిగతా అవయవాలూ యథాశక్తి కదిలి, నవ్వుకు సహకరిస్తాయి. ఇతర జంతువులూ వాటి ఆటలలో శబ్దాలు వెలువరిస్తాయి. కానీ వాటిని (ఆ శబ్దాలు) నవ్వులు అనడం కొంచెం కష్టమే. నిజమో కాదో తెలుసుకోవడానికి కొందరు కొంటె శాస్త్రవేత్తలు ఎలుకలను పరిశోధించారు. ఎలుకలకు గిలిగింతలు పెట్టి (ఎలాగో మనకు తెలీదు) అవి సరదాగా ఆడుకుంటున్నప్పుడు వాటి శబ్దాలు రికార్డు చేసి పరిశోధనలు చేశారు. ఆ సమయాలలో అవి (ఎలుకలు మహాప్రభో) కీచు గొంతుతో తీవ్ర శబ్దాలు చేస్తాయని తెలిసింది, ఆ శబ్దాలు సదరు ఎలుక జాతికి నవ్వులాటేమో గానీ మనకు ప్రాణాంతకం! మనం ఆవిర్భవించిన ఈ కొద్ది మిలియన్ల ఏళ్లలోనే మన జీవితాలనీ, జీవనాన్నీ, వ్యవహారాలనీ ఎంతో సంక్లిష్ట పరచుకున్నాం. మరెన్నో కొత్త పోకళ్లు అలవర్చుకున్నాం. ఈ క్రమంలో మన లక్షణాల మూలాలు గుర్తించలేనంత భిన్నంగా మారిపోయాయి. మనం సంతోషంగా ఉన్నప్పుడు మిగతా జంతువులలా చెవులను ఆడించము, ముక్కు పైకి లేపలేము. నవ్వుతాము. పళ్లికిలించడం నుండి హాయిగా నవ్వే వరకు మనం మహా వానరాలనుండే పరిణమించాం. అందుకే నవ్వు మన ప్రత్యేకత. మనకు ప్రత్యేకం.

నానా రకాల నవ్వులు

నవ్వులు ఒక రకంగా వుండవండీ బాబూ! వాటి దుంపదెగ ఎన్ని రకాలుంటాయో!! చెప్పడానికే కాదు. వినేవారికి, చదివేవారికి కూడా నవ్వొచ్చేస్తుంది. కావాలంటే మీరే చూడండి. దరహాసం అంటే చిరునవ్వు. అంటే దంతాలు కనిపించకుండా నవ్వడం. ఇంకా బాగా చెప్పకోవాలంటే... అసలు నవ్వారో లేదో కూడా తెలీనంతగా వుండే నవ్వన్నమాట. కోపంతో పెద్దగా నవ్వితే అది అతిహాసం. అచ్చురితం అంటే ఎత్తిపొడుపు నవ్వు. కళ్లను చెక్కిళ్లను వికసింపచేసి కొద్దిగా దంతాలు కనిపించేటట్లు నవ్వితే హాసితం. గొంతులోంచి శబ్దం బయటికి రానీకుండా ఓరకంట చూస్తూ పల్చగా నవ్వితే విహాసితం. ఓరచూపు చూస్తూ ముకుపుటాలను వికసింపచేసి భుజాలు కదిలేట్లు నవ్వితే అపహాసితం. కొందరు నవ్వితే వెకిలినవ్వు, వెర్రినవ్వు, పిచ్చినవ్వు, బొబ్బనవ్వు అని కూడా అంటుంటారు. అమాయకమైనది వెర్రి నవ్వు. ఆపుకోలేక విరగబడి నవ్వేది పిచ్చినవ్వు. పెద్దగా శబ్దం వచ్చేట్టు నవ్వితే బొబ్బ నవ్వు. ఇవి కాక తాళం నవ్వు అని ఒకటుంది తెల్సా. తలను విదిలిస్తూ కళ్లు మూసుకుని నవ్వడాన్ని తలకాయ నవ్వు అంటారు. తాళం వెయ్యడానికి వీలైనది లయధాటి నవ్వు. పెదవులు బద్దలు చేసేట్టు వచ్చే నవ్వు తుపాకి నవ్వు. ఇవే కాకుండా కోతి నవ్వు, దాగుడు ముచ్చీ నవ్వు, డోకు నవ్వు, దగ్గు నవ్వు, కొలిమితిత్తి నవ్వు, గూడ్సు బండి నవ్వు అని విచిత్రమైన విలక్షణమైన నవ్వులున్నాయి.

నిరంతరం ఒత్తిడికీ, దిగుళ్లకీ లోనై మనుషుల్లో హాస్య ప్రియత్వం తగ్గిపోతోంది. హాయిగా స్వేచ్ఛగా, నవ్వే అమ్మాయిలు అరుదుగా కనిపిస్తారు. మగవాళ్లలోనూ నవ్వు ఎక్కడ వుంది? ఏదో సీరియస్‌గా ముఖమంతా గంటు పెట్టుకొని కూచుంటారు. నవ్వుతూ, నవ్విస్తూ చలాకీగా వుండే తత్వం కూడా అరుదే. అందుకే నవ్వు భాగ్యమైపోయింది. అందుకే ఇప్పుడు నవ్వడం కొత్తగా నేర్చుకోవాల్సిన అవసరమొచ్చింది. ఇప్పుడు నగరాల్లో, పట్టణాల్లో లాఫింగ్ క్లబ్బులు ఏర్పడ్డాయి. నవ్వులను మరిచిపోయిన వాళ్లకు నవ్వడం నేర్పిస్తున్నాయి. నవ్వడాన్ని ప్రాక్టీస్ చేయిస్తున్నాయి. నవ్వును చంపేసిన మనమే నవ్వడం నేర్చుకుంటున్నాం. ఏది ఏమైనా ఎరుపెక్కినముఖం, వంకరతిరిగిన మూతి, బరువెక్కిన హృదయం... అన్నిటికీ విరుగుడు నవ్వే. హాస్య చిత్రాలు, నాటకాలు, రచనలు, కార్టూన్లు వగైరాల వల్ల గుండె బరువెక్కే ప్రమాదమే వుండదు.

నవ్వుతో జబ్బులకు చెక్

జబ్బులలో 70 శాతం ఏదో ఒక విధమైన ఒత్తిడికి సంబంధం వున్నవే. అధిక రక్తపోటు, గుండెజబ్బులు, డిప్రెషన్, ఇన్సోమియా, మైగ్రిన్, ఆతృత, అలర్జీ, పెప్టిక్ అల్సర్... వగైరాలు ఆ కోవకు చెందినవే. నవ్వుల మందు తీసుకుంటే అవి తగ్గుముఖం పట్టే అవకాశం వుంది. అయితే దీర్ఘకాలిక వ్యాధులు కేవలం నవ్వు మందుతోనే తగ్గుతాయని చెప్పలేం. పైగా ఒత్తిడికి గురవడం వల్ల అడ్రినాలిన్ ఎక్కువగా విడుదలౌతుంది. నవ్వితే అది బాగా తగ్గుతుంది. తమలో తాము ముడుచుకుపోయే వారితో పోలిస్తే తరచూ నవ్వేవారికి గుండెజబ్బు వచ్చే ప్రమాదం తక్కువ.

టెన్షన్ తగ్గించే సేఫ్టీ వాల్వులాంటి నవ్వు వల్ల ఒత్తిడికి కారణమైన హార్మోన్ల ఉత్పత్తి తగ్గి ఉపశమనం కలుగుతుంది. 10 నిమిషాలు నవ్వగలిగితే 10-20 మి.మీ రక్తపోటు తగ్గుతుంది. రోజువారీ నవ్వులు రోగనిరోధక వ్యవస్థను వృద్ధి చేస్తాయి. అందుకు అవసరమైన లింపొసైట్స్ ఉత్పత్తిని పెంచుతాయి. అలాగే ముక్కు, శ్వాసకోశ వ్యవస్థకు సంబంధించిన పొరలలో నవ్వుల వల్ల మెరుగుదల వుంటుందని పరిశోధకులు చెబుతున్నారు. శరీరంలో సహజరోగ నిరోధకాలైన హార్మోన్ల ఉత్పత్తి పెరిగి, ఆర్థరైటిస్, స్పాండులైటిస్, మైగ్రిన్ వంటి వ్యాధుల్లో ఉపశమనం లభిస్తుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం, రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతాయి. కనుక ఆస్తమా రోగులకూ మేలు కలుగుతుంది.

జీవితంలో ఆశ, విశ్వాసం అవసరం. హాస్యం ఆ రెంటినీ ఇస్తుంది. సజీవమైన నవ్వులు తొణికిసలాడేవారే అత్యంత ఆకర్షణీయమైన వ్యక్తులు. పసిపిల్లల బోసి నవ్వులు గుర్తు చేసుకుంటే మీ విచారం క్షణంలో మాయమౌతుంది.

అందుకనే ఎవరైనా హాయిగా నవ్వుతుంటే చూసి విసుక్కోకుండా, ఎగతాళిగా నవ్వుకోకుండా... మీరూ ఆ నవ్వులలో పాలు పంచుకోండి మరి.

మీ నవ్వే మీకు టానిక్.

-కె.చరిత, యాజీవ్

సుగుణాల సపోటా

సపోటా అనగానే సాధారణంగా పేదవాళ్ల పండుగా భావిస్తారు. కానీ ఇది అన్నిట్లో రిచ్చే. దీంట్లో ఎన్నో పోషక విలువలు, ఎన్నెన్నో సద్గుణాలు, ఔషధగుణాలు ఉన్నాయి. దీన్ని పిల్లలు చాలా ఇష్టంగా తింటారు. పక్వానికొచ్చేవరకు చెట్టున సరిగ్గా ఉంచితే పంచదార కన్నా తియ్యనైనదంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదేమో! ఇది త్వరగా జీర్ణమవుతుంది. దీని వల్ల అధిక బరువు పెరుగుతారన్న భయమూ అవసరం లేదు. మరి ఇన్ని మంచి గుణాలున్న సపోటా గురించి...

సపోటా పండు కోడిగుడ్డు ఆకారంలో 4 నుండి 8 సెంటీమీటర్ల పొడవుంటుంది. దాని పైభాగం నున్నగా బంగాళదుంపలా కనిపిస్తుంది. దీని గుజ్జు పాలిపోయిన పసుపు రంగులో తియ్యగా, చాలా రుచిగా ఉంటుంది. వీటిలో 2 నుండి 5 గింజలుంటాయి. ఇవి ఒక వైపు బాగా పదునుగా ఉంటాయి. అందుకే వీటిని తినేప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. చెట్టు నుండి కోసేంతవరకు ఇవి పండవు.

చాలామంది సపోటాను మిగతా పండ్లలా చూడరు. కానీ ఇది ఇతర పండ్లకు ఏం తీసిపోదు. దీనిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలో ఉండే ఏంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్, ఇంకా ఇతర రోగాలను అరికడతాయి.

సపోటా పండ్లలోని 'సి' విటమిన్ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మృదులాస్థి, ఎనీమియాలను అరికడుతుంది. చర్మం, పళ్లు, జుట్టు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. అంతేకాదు ఎముకలకు, చర్మానికి, దృష్టికి అవసరమైన 'ఎ' విటమిన్ కూడా దీనిలో ఉంది. శ్లేష్మము దృఢంగా ఉండేందుకు తోడ్పడుతుంది. సపోటాను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు దరిచేరవు. పళ్లు బలంగా తయారవుతాయి. ఇంకా సపోటాలో పోటాషియం, కాపర్, ఐరన్ వంటి ఖనిజాలు, ఫోలేట్, నియాసిన్ వంటి విటమిన్లు, పాంటోథెనిక్ ఆమ్లం మెండుగా లభిస్తాయి. వీటి సమూహం జీవక్రియ సక్రమంగా పనిచేయడానికి ఉపకరిస్తుంది. దీనిలో పీచు పదార్థాలూ అధికమే. అందువల్ల మలబద్ధకం, కడుపులోని ఇతర ఇన్‌ఫెక్షన్లను నివారిస్తుంది. రెండు సపోటా పండ్లలో 100కు పైగా క్యాలరీలు ఉంటాయి. సాయంత్రం సమయంలో వీటిని స్నాక్స్‌లా కూడా తీసుకోవచ్చు.

సపోటాతో వెరైటీలు

★సపోటాలోని గుజ్జును సలాడ్‌లలో కలుపుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

★వీటితో సాస్ కూడా తయారుచేసుకోవచ్చు. సపోటా పైతొక్క, గింజలు తీసి ఆరెంజ్ జ్యూస్‌లో కలిపితే చక్కటి సాస్ తయారవుతుంది. దానికి పైన క్రీమును అలంకరిస్తే మరింత బాగుంటుంది.

★సపోటాతో ఐస్‌క్రీమ్, మిల్క్‌షేక్‌లను కూడా తయారుచేసుకోవచ్చు.

★సాధారణంగా మనదేశంలో సపోటాను వండరు. దాన్ని నిల్వ కూడా చేయరు. కానీ ఇండోనేషియా, మలేషియా వంటి దేశాల్లో దీన్ని ఫ్రై చేసుకుని తింటారు. అల్లం, నిమ్మ రసం వేసి మాంసంతో కూడా కలిపి వండుకుంటారట. అంతేకాదు వీటి పండ్లనుండి రసం తీసి మరగబెట్టి దాన్ని నిల్వ ఉంచుకుంటారు.

★సపోటాతో పైను కూడా తయారు చేసుకోవచ్చు. పై అంటే లోపల మాంసం లేదా ఏదైనా పండును ఉంచి పైన పిండి పూసి కాల్చి తినే వంటకం. సపోటాను ముక్కలుగా కోసి అవి బంకగా అవకుండా వాటిమీద నిమ్మరసం, పంచదార జల్లి పైలు తయారుచేస్తారు.

★ఈ పండ్లతో వైన్ కూడా తయారుచేస్తారు.

★ఇండోనేషియా ప్రజలు సపోటా చెట్టు చిగుళ్లను పచ్చిగా గానీ అన్నంతో ఉడకబెట్టి గానీ తింటారు.

ఆరోగ్య పరంగా...

సపోటాలో జిగురు ఎక్కువగా ఉంటుంది. వీటిని ఉడకబెట్టి ఆ నీటిని తాగితే డయేరియాను అరికట్టవచ్చు.

★సపోటా పువ్వులు, పండ్ల మిశ్రమం శ్వాస సంబంధ వ్యాధులను నయం చేస్తుంది.

★సపోటా బెరడు రసంతో చేసిన టీ డిసెంట్రీ, డయేరియాలను అరికడుతుంది.

ఇతర ఉపయోగాలు

★సపోటా చెట్టు బెరడులో తెల్లని జిగురు పాలు ఉంటాయి. వీటిలో 15 శాతం రబ్బరు, 38 శాతం రెజీన్ ఉంటాయి. పాల వంటి జిగురు పదార్థం చూయింగ్ గమ్ తయారీలో వాడే ముఖ్యమైన పదార్థం.

★సపోటా చెట్ల కలప చాలా గట్టిగా, బరువుగా ఉంటుంది. దీంతో తలుపులు, కిటికీలు, ఇంకా ఇతర ఫర్నీచర్, ఎడ్ల బండ్లు కూడా చేస్తారు.

★సపోటా చెట్టులో లభించే ఆమ్లమును 'డై'లో వాడతారు.

ఎక్కడ పుట్టాయి?

మధ్య అమెరికా, దక్షిణ మెక్సికో సపోటా పుట్టుక స్థలాలు. సపోటా చెట్టు ఉష్ణప్రాంతాలలోనే ఎక్కువగా పెరుగుతుంది. తగినంత ఉష్ణోగ్రత లేకపోతే ఇవి చచ్చిపోతాయి. అయితే భారతదేశంలో ఎక్కువగా పెరుగుతాయి. ఈ చెట్లు 30 నుండి 40 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాయి. ఇవి సంవత్సరానికి రెండు కాపులనిస్తాయి. ఇవి 5 నుండి 8 సంవత్సరాల వరకు మాత్రమే పండ్లనిస్తాయి. వీటిలో చాలా రకాలుంటాయి. వాటిలో ముఖ్యమైనవి:

1.బ్రౌన్ షుగర్

ఈ రకం సపోటాలను 1948లో కనుగొన్నారు. ఇవి 2 నుండి 2.5 అంగుళాల పొడవుంటాయి. ఈ చెట్లు చాలా పొడవుగా, పొదలుపొదలుగా ఉంటాయి. ఇవి చాలా తియ్యగా, జ్యూసీగా ఉంటాయి.

2.ప్రోలిఫిక్

ఇవి 1951లో వెలుగులోకి వచ్చాయి. ఇవి గుండ్రంగా ఉంటాయి. దీని గుజ్జు గులాబి రంగులో ఉంటుంది. తియ్యగా, జ్యూసీగా, చాలా రుచిగా ఉంటుంది. ఇవి చాలా త్వరగా కాపుకొస్తాయి. ఎక్కువ మొత్తంలో పండ్లనిస్తాయి.

3.రస్సెల్

రస్సెల్ రకం పండ్లను 1935లోనే కనుగొన్నారు. ఇవి చాలా పెద్దగా, గుండ్రంగా ఉంటాయి. 3 నుండి 5 అంగుళాల పొడవుంటాయి. తియ్యదనం చాలా ఎక్కువ. మంచి సువాసనను కలిగి ఉంటాయి.

4.టాకిల్

ఇవి కోడిగుడ్డు ఆకారంలో ఉంటాయి. ప్రోలిఫిక్ రకం కంటే చిన్నవిగా ఉంటాయి. ఇవి చాలా త్వరగా పక్వానికి వస్తాయి. మిగతావాటి కంటే ఇవి చాలా రుచిగా ఉంటాయి.

★



నారదుడు

మూలం : హిందీ కథ

అనువాదం : ఆర్. శాంతసుందరి

టీచర్‌గా ఇరవైఏడేళ్ల క్రితం పనిచేసిన అదే ఊరికి నిఖిల్‌కి బదిలీ అయింది. ఈసారి అతను ప్రిన్సిపాల్‌గా తన పాత స్కూల్లోనే చేరబోతున్నాడు. ఆ ఊరి గురించీ, పరిశుభ్రమైన ఆ వాతావరణం గురించీ, అమాయకులైన అక్కడి జనం గురించీ అతనికన్నీ తియ్యటి జ్ఞాపకాలే ఉన్నాయి. రైల్లో వస్తున్నంత సేపూ భార్యకీ, కూతురికీ తన పాత అనుభవాలను చెప్తూనే ఉన్నాడు నిఖిల్. "చూద్దురుగానీ స్టేషన్‌కి నాకోసం ఎంతమంది జనం వస్తారో!" అన్నాడు.

రైలు దిగ్గానే ప్లాట్‌ఫారం మీద తను పనిచేసినప్పుడు ప్యూన్‌గా ఉండిన ఘనానంద్ తప్ప ఇంకెవరూ లేరని తెలిసింది. సామానంతా ట్రాలీ మీదకు ఎక్కించి నడుస్తుంటే "పాత ప్రిన్సిపాల్ ఇంకా క్వార్టర్ ఖాళీ చెయ్యలేదండీ. అందాకా స్కూల్లోనే ఒక గదిలో మీ బస ఏర్పాటు చేశారు" అన్నాడు ఘనానంద్. ఒకప్పటి గ్రామం ఇప్పుడు పెరిగిపోయి చిన్న పట్టణంలా తయారైందనీ, పట్టణాల లక్షణాలు పూర్తిగా దానిమీద ముద్ర వేసుకున్నాయనీ నిఖిల్ గమనించాడు.

కాలం గడిచినకొద్దీ ఆ లక్షణాలు మరింత ప్రస్ఫుటంగా కనిపించసాగాయి. స్కూలు మునుపటికన్నా పెద్దదిగా ఉంది, కానీ ఎక్కడ చూసినా మురికి, చెత్తా చెదారం. టీచర్లు ట్యూషన్లు చెబుతూ పాసు చేసేందుకు రకరకాల వ్యాపారాలు చెయ్యడంలో మునిగిపోయి కనిపించారు. ప్రతి టీచర్‌కీ పై వరకూ ఎవరో ఒకరితో పరిచయాలున్నాయి. స్కూల్లో క్రమశిక్షణ పాడవడానికి కారణం టీచర్లే అని నిఖిల్ గమనించాడు. విద్యార్థుల్లోనూ, టీచర్లలోనూ గూండాయిజం చేసే వాళ్లదే పైచెయ్యిగా ఉంది. మిగతా వాళ్లందరూ భయంతో బిక్కచచ్చిపోయి కనిపించారు.

నిఖిల్ ఇలాంటివి సహించలేదు. కొంచెం కఠినంగా ప్రవర్తించాడు. ముందుగా అతను నందలాల్ టీచర్‌ని పిలిచి చీవాట్లు పెట్టాడు. ఆ తరువాత రతన్‌ప్రసాద్ యాదవ్ వంతు వచ్చింది. అదే అతను చేసిన పొరపాటు. యాదవ్ ఏ మాత్రం మర్యాదలేకుండా ఎదురు జవాబు చెప్పాడు. నిఖిల్ అతని మీద అధికారికి రిపోర్టు రాసి పంపాడు. కానీ అది ఆయన దాకా వెళ్లనేలేదు. ఆ ఆఫీసులోని క్లర్కు యాదవ్‌కి ఆ రిపోర్టు అందించి, డబ్బు పట్టుకుని చక్కాపోయాడు.

ఘనానంద్ అతనికి నచ్చజెప్పాడు. "సార్, ఇది ఒకప్పటి పల్లెటూరు కాదండి. ఇప్పుడు పెద్ద ఊరు. రాజకీయనాయకులూ, గూండాలూ, నిజాయితీ లేని ఉద్యోగులూ ఇప్పుడిక్కడ రాజ్యం చలాయిస్తున్నారు" కోపాన్ని దిగమింగుకున్నాడు నిఖిల్. కానీ ఇక్కడ తను క్రమశిక్షణను ప్రవేశపెడితే దానికి అందరూ ఎదురు తిరుగుతారు. కష్టాలు తప్పవు మరి. తనిక్కడకు వచ్చిందే అందుకు కదా అనుకున్నాడాయన.

నిఖిల్ కుటుంబంతో ఆ ఊరికి వచ్చిన మూడోరోజున మార్కెట్‌కెళ్లిన ఆయన కూతురు ఇంటికి తిరిగిరాలేదు. నిఖిల్ పోలీస్‌స్టేషన్‌కెళ్లాడు. పోలీసులు ఆయనకు సాయం చేయకపోగా "మాస్టారూ ఇక్కడ ఇలాంటివి మామూలేనండీ. రెండు మూడు రోజుల్లో అమ్మాయిలు వెనక్కి వచ్చేస్తారు. ఎవరూ రిపోర్టు చెయ్యరు, చెడ్డ పేరొస్తే మళ్లీ ఆ ఆడపిల్లలకు పెళ్లి కావద్దా?" అన్నారు.

స్టాఫ్‌రూమ్‌లో యాదవ్ సూటీపోటీ మాటలతో విషం కక్కాడు. "తన కూతుర్ని క్రమశిక్షణలో పెడితే ఇలా ఎందుకు జరిగుండేది?" అక్కడున్న మాస్టర్లందరూ అతని మాటలకు విరగబడి నవ్వారు.

ఇరవైరోజులు గడిచిపోయాయి. నిఖిల్ ఎస్.పి. దగ్గరకెళ్లి పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు రాసుకోలేదని ఫిర్యాదు చేసి, సహాయం కోరాడు. ఎస్.పి ఏమాత్రం మర్యాద లేకుండా కసురుకున్నాడు. "పిల్లల్ని మరీ అదుపులో పెట్టి, గదిలో ఉంచి తాళం వేస్తే ఇలాగే అవుతుంది. ఎవడితోనో లేచిపోయేసరికి ఇప్పుడు

ఇదే సమాచారాన్ని నారదుడు బ్రహ్మకీ, శివుడికీ కూడా చెప్పాడు. త్రిమూర్తులు ముగ్గురూ ఒక చోట చేరి నారదుడు ఇచ్చిన రిపోర్టుని పరిశీలించారు. ఆ తరువాత మూడు లోకాలనీ క్షుణ్ణంగా పరీక్షించారు. బ్రహ్మకు చాలా సంతోషంగా ఉంది... మనుషులూ, జంతువులూ నిత్యం సృష్టికార్యంలో నిమగ్నమై కనిపించారు. అరక్షణంలో లక్షలమందిని సంహరించే యంత్రాలను మానవుడే స్వయంగా నిర్మించుకోగలగడం చూసి ఈశ్వరుడు ఆనందించాడు.

ఏడుస్తున్నావా? మాకన్నీ తెలుసు. పోలీసులు నీ …ళ్లనుకుంటున్నారా? మాకు వేరే పనేమీ ఉండదా?" అన్నాడు.

తిట్లు తిని నిఖిల్ వెనక్కి వచ్చాడు. జీతం చేతికి రాగానే రాష్ట్రరాజధానికి వెళ్లి హోంమంత్రిని కలవాలని నిశ్చయించుకున్నాడు.

★★★

అదేరోజు సాయంత్రం నారదుడు భూప్రపంచమంతా చుట్టివచ్చి, తన రిపోర్టుని విష్ణుమూర్తికి అందించేందుకు క్షీరసాగరాన్ని చేరుకున్నాడు. "ప్రభూ! భూప్రపంచం అత్యాచారాలతో అట్టుడికిపోతోంది!" అన్నాడాయన విష్ణువుతో.

"అదేమిటి నారదా? మరి నాకు ప్రతిక్షణం ఆ లోకం నుంచి వేద ధ్వనుల క్యాసెట్‌లే వినిపిస్తున్నాయే! క్షీర సముద్రాల్లో ఎక్కడా అల్లకల్లోలం లేదు! ఎక్కడో మీవల్ల పొరపాటు జరిగిపోయింది. కళ్లు సరిగ్గా కనబడడం లేదేమో, మీరు కూడా మానవుల్లాగా కళ్లజోడు పెట్టుకోవాలేమో చూడండి!" అన్నాడు విష్ణుమూర్తి.

"దేవా! విశాలమైన సముద్రాల మీద పెద్ద పెద్ద ఓడలనెక్కి, గర్విష్టి మనిషి చేపలను చంపుతున్నాడు. ఎప్పటికైనా భరించలేక సముద్రాలు ఎగసిపడితే ప్రపంచమంతా హాహాకారాలు చెలరేగుతాయి. పచ్చటి వసుంధర ప్రస్తుతం కాంక్రీటు అరణ్యంగా మారిపోతోంది. మనుషులు ధర్మాన్నీ, న్యాయాన్నీ నమ్మడం మానేశారు. సాధువులూ, సన్యాసులూ ధనంతో మోక్షసాధనకోసం ప్రయత్నిస్తున్నారు. యంత్రాలు పెరిగిపోయి ప్రకృతి నియమాలన్నిటినీ ఉల్లంఘిస్తున్నాయి. ఆస్తికుడెవరో, నాస్తికుడెవరో గుర్తుపట్టేందుకు వీల్లేకుండా ఉంది. ప్రపంచమంతా ఒక పెద్ద మార్కెట్టుగా మారిపోతోంది. మాస్టర్ నిఖిల్ లాంటి కర్తవ్యపరాయణుడు, నిజాయితీపరుడు, పోలీసులతో రిపోర్టు కూడా రాయించలేకపోతున్నాడు"

విష్ణుమూర్తి చిరునవ్వు నవ్వి, "సరే, స్వర్గలోకం రిపోర్టు ఏదీ?" అన్నాడు. "అక్కడ కూడా అంతా అస్తవ్యస్తంగా ఉంది నారాయణా! సాధువులూ, ఋషులూ కలిసి న్యాయం, అన్యాయం, ధర్మం, అధర్మం అనే విషయాలను అర్థం కాకుండా, చిక్కుముడిలా చేసేశారు. చిత్రగుప్తుడికి కూడా అర్థం కావడంలేదు. ఆయన జుట్టు పీక్కుంటున్నాడు. దొంగలూ, దోపిడీదార్లూ, లంచగొండ్లూ, దొంగవ్యాపారులూ, అబద్ధాలు చెప్పే నాయకుల్లూ, దేవాలయాల్లో పెద్ద పెద్ద మొత్తాలను హుండీల్లో వెయ్యగలగడం వల్ల వాళ్లకే పుణ్యం దక్కుతోంది. కృత్రిమ మార్గంలో గర్భాలు ధరిస్తున్నారు స్త్రీలు. ఇలాగే స్వర్గానికి చేరకుండా హక్కులేని వాళ్లందరూ అక్కడికి వస్తున్నారు. ఇంద్రుడు చాలా ఆందోళన పడుతున్నాడు. ఆయన ఇంద్రసభ వెలవెలబోతోంది. అప్సరసలందరూ భూలోకం నుంచి వచ్చిన ధూర్తుల మాయలో పడి కొట్టుకుంటున్నారు" అన్నాడు నారదుడు.

ఇదే సమాచారాన్ని నారదుడు బ్రహ్మకీ, శివుడికీ కూడా చెప్పాడు. త్రిమూర్తులు ముగ్గురూ ఒక చోట చేరి నారదుడు ఇచ్చిన రిపోర్టుని పరిశీలించారు. ఆ తరువాత మూడు లోకాలనీ క్షుణ్ణంగా పరీక్షించారు. బ్రహ్మకు చాలా సంతోషంగా ఉంది... మనుషులూ, జంతువులూ నిత్యం సృష్టికార్యంలో నిమగ్నమై కనిపించారు. అరక్షణంలో లక్షలమందిని సంహరించే యంత్రాలను మానవుడే స్వయంగా నిర్మించుకోగలగడం చూసి ఈశ్వరుడు ఆనందించాడు. ఇక విష్ణువుకు అమితమైన ఆనందాన్నిచ్చిన విషయం, సత్యయుగంలో కన్నా కొన్ని కోట్ల రెట్లు ఎక్కువగా ప్రార్థనా స్థలాలు, గుళ్లు, మసీదులూ, చర్చిలూ ఆయనకు భూలోకంలో కనిపించాయి. బురదలో పాకే పురుగుల్లాగ దయనీయంగా బతికే జనం ఉన్నచోట కూడా బ్రహ్మాండమైన ధార్మిక స్థలాలు ఆయనకు కనిపించాయి.

మళ్లీ ముగ్గురూ పైలోకానికి

నిఖిల్ కుటుంబంతో ఆ ఊరికి వచ్చిన మూడోరోజున మార్కెట్‌కెళ్లిన ఆయన కూతురు ఇంటికి తిరిగిరాలేదు. నిఖిల్ పోలీస్‌స్టేషన్‌కెళ్లాడు. పోలీసులు ఆయనకు సాయం చేయకపోగా "మాస్టారూ ఇక్కడ ఇలాంటివి మామూలేనండీ. రెండు మూడు రోజుల్లో అమ్మాయిలు వెనక్కి వచ్చేస్తారు. ఎవరూ రిపోర్టు చెయ్యరు. చెడ్డ పేరొస్తే మళ్లీ ఆ ఆడపిల్లలకు పెళ్లి కావద్దా?" అన్నారు.

స్టాఫ్‌రూమ్‌లో యాదవ్ సూటీపోటీ మాటలతో విషం కక్కాడు. "తన కూతుర్ని క్రమశిక్షణలో పెడితే ఇలా ఎందుకు జరిగుండేది?" అక్కడున్న మాస్టర్లందరూ అతని మాటలకు విరగబడి నవ్వారు.

వెళ్లి కలుసుకుని మాట్లాడుకున్నారు. నారదుడు చాలా తప్పుడు రిపోర్టింగ్ చేస్తున్నాడన్న నిర్ధారణకు వచ్చారు. ముగ్గురూ ఏకగ్రీవంగా నారదుడి చెవులు కత్తిరించాలనీ, కళ్లు పీకెయ్యాలనీ, నాలుక కోసెయ్యాలనీ నిర్ణయించారు.

★★★

అదే రోజు రాత్రి నిఖిల్ రాజధానిలోని గృహమంత్రిని కలిసేందుకు బయలుదేరారు. నిర్మానుష్యంగా ఉన్న ఒక చోట ఆయన్ను కొందరు దుండగులు పట్టుకున్నారు. కళ్లు మూసుకుని కఠినమైన క్రమశిక్షణ అమలు చేస్తున్నాడని ఆయన మీద ఆరోపణ ఉంది. అందుకని ఆ దుండగులు ఆయన చెవులు కత్తిరించి, కళ్లు పీకేసి, నాలుక కోసేసి, దవడ వాయగొట్టి "ఇప్పుడు చెయ్యి ఏంచేస్తావో... గాంధీ గారి కోతీ!" అని తరిమి కొట్టారు.

★★★

అప్పట్నుంచీ పైన ఆకాశంలో మూగగా వీణ వాయించుకుంటూ నారదుడు గ్రహాంతర లోకంలో తిరుగుతూనే ఉన్నాడు. నిఖిల్ పిచ్చివాడై వీధులవెంట తిరుగుతూ కనబడుతున్నాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రస్తుతం హాయిగా ఉన్నారు. మాటిమాటికీ నారదుడు వచ్చి వాళ్లను పీడించడం లేదు. ఇక స్కూలు తన పాత పద్ధతినే కొనసాగిస్తూ చక్కగా నడుస్తోంది. డబ్బు పారెయ్యడం, చదవకుండానే పాసైపోవడం విద్యార్థులకు హాయిగా ఉంది.

★

మ్యాంగో ఫూల్

కావలసిన పదార్థాలు

తియ్య మామిడిపండ్లు -3

పాలు - 2 కప్పులు, చక్కెర - 4 స్పూన్లు,

సోడా - 1/4 స్పూను, యాలకుల పొడి - 1 స్పూను

తయారుచేసే విధానం

మామిడిపండు తొక్కతీసి లోపల కండను పెద్ద ముక్కలుగా తరగాలి. నీళ్లుపోసి, ముక్కలు మెత్తగా అయ్యేలా గ్రైండర్‌లో వేసుకోవాలి. చేతితో కూడా చేయొచ్చు. పల్చటి బట్టలో వడకట్టి ముక్కలు జ్యూస్ విడిగా తీయాలి.

జ్యూస్‌లో చిటికెడు సోడా వేసి వుంచాలి.

పాలు రెండు, మూడు పొంగులు వచ్చేంతవరకు చూసుకోవాలి.

పాలలో మామిడిపండ్ల రసం కలిపి, యాలకుల పొడి, పంచదార పొడి వేసి బాగా కలిపి ఫ్రిజ్‌లో ఒక గంటసేపు పెట్టి సర్వ్ చేయాలి.

మ్యాంగో షేక్



కావలసిన పదార్థాలు

మామిడిపండు - 1

పంచదార - 1 స్పూన్

పాలు - 2 గ్లాసులు

ఐస్‌ముక్కలు - ఇష్టాన్ని బట్టి

రోజ్‌వాటర్ - 1/2 స్పూన్

తయారు చేసే విధానం

మామిడిపండు తోలు తీసి, ముక్కలు కోసి పాలల్లో కలపాలి.

పాలల్లో మామిడిపండు ముక్కలతోపాటు పంచదార కూడా వేసి, రెండు నిమిషాలుపాటు బాగా నురుగు వచ్చేటట్లు చిలకాలి.

రోజ్‌వాటర్ చల్లి కొంచెంసేపు ఫ్రిజ్‌లో వుంచాలి.

సర్వ్ చేసేముందు గ్లాస్‌లో ఐస్‌ముక్కలు వేసి, పైన జ్యూస్ పోసి ఇవ్వాలి.

గ్రీన్ మ్యాంగో పుడ్డింగ్

కావలసిన పదార్థాలు

పచ్చి మామిడికాయ తురుము - 1/4 కేజి

పంచదార - 1/4 కేజి

జిలేబీరంగు - 1/4 స్పూన్లు

గుడ్లు - 2, పాలు - 1 కప్పు

పంచదార - 1/2 కప్పు

వెనీలా ఎస్సెన్సు - 1/2 స్పూను

తయారుచేచే విధానం

తురిమిన మామిడికాయను పంచదార, మిఠాయిరంగు, నీళ్ళు పోసి ఉడికించి చల్లార్చాలి.

పాలు, గుడ్లలోని సొన, పంచదార, వెనీలా ఎస్సెన్సు పోసి బాగా గిలక్కొట్టి ఆవిరిమీద ఉడకనివ్వాలి.

ఉడికిన మామిడికాయ తురుము మధ్యలో పై మిశ్రమాన్ని పోసి ఫ్రిజ్‌లో రెండు గంటలపాటు వుంచి సర్వ్ చేయాలి.





మ్యాంగో ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు

బంగినపల్లి మామిడి పళ్లు - 3

పాలు - 1 లీ, పంచదార - 5 స్పూన్లు

కమలాపండ్లు - 1/2 కప్పు రసం

నిమ్మరసం - 1 స్పూను

తయారు చేసే విధానం

మామిడికాయను తొక్కుతీసి చిన్న చిన్న ముక్కలుగా కోసి గుజ్జుగా చేయాలి.

రెండువంతుల పాలు ఆవిరయ్యేలా బాగా మరిగించాలి. తరువాత తయారు చేసిన పళ్ళ గుజ్జును కలపండి.

ట్రేలో మిశ్రమాన్ని పోసి మూతపెట్టి డీప్ ఫ్రిజ్‌లో వుంచాలి. 2 గంటల తర్వాత తీసి, బాగా గిలక్కొట్టి మరలా ఫ్రీజర్‌లో వుంచాలి.

సర్వ్ చేసేటప్పుడు ఐస్‌క్రీమ్ కప్పులో కొంత ఐస్‌క్రీమ్ తీసి పైన కొన్ని పండ్ల ముక్కలు వేసి సర్వ్ చేయాలి.

ఉత్సాహంగా... ఉల్లాసంగా... వుండాలంటే...

"అబ్బ రొటీనైపోయింది జీవితం. అదే పని, అదే ఆఫీసు... బోరు కొడుతోంది. ఏ పని చేయాలన్నా నిరాసక్తిగా ఉంది. ఏదీ కొత్తగా ఆలోచించలేకపోతున్నాను" అని ఏదో ఒక సందర్భంలో అనుకోనివారుండరు. మరి ఆ విధంగా అనిపించకూడదంటే, ఎప్పుడూ ఉత్సాహంగా, ఉల్లాసంగా, సృజనాత్మకంగా ఉండాలంటే ఏంచేయాలో ఈ వారం తెలుసుకుందాం.

పిల్లలకైనా, పెద్దలకైనా రోజూ ఒకే విధంగా ఉంటే బోరు కొడుతుంది. మెదడు మొద్దుబారిపోతుంది. పిల్లలకు చదువు మీద, పెద్దలకు చేస్తున్న పని మీద ఆసక్తి ఉండదు. దీనివల్ల చాలా అనర్ధాలు వస్తాయి. కొత్త ఆలోచనలేవీ రావు. ఓ యంత్రంలా తయారైపోతారు. చేస్తున్న పనిలో ఎదుగుదల ఉండదు. దీంతో 'జీవితమంటే ఇంతేనా?' అనే ఒక నిరాసక్తి ఏర్పడుతుంది. ఆ విధంగా జరగకూడదంటే అప్పుడప్పుడూ మన జీవన విధానాన్ని కొద్దిగా మారుస్తూ ఉండాలి. రొటీన్‌కు భిన్నంగా ఏదైనా కొత్త కోణంలో ఆలోచించాలి.

పొద్దున లేవగానే త్వరత్వరగా తమ పనులు ముగించుకుని పెద్దలు ఉద్యోగాలకు, పిల్లలు స్కూళ్లకు వెళ్తుంటారు. సాయంత్రం ఇంటికి రాగానే మళ్లీ ఎవరి పనుల్లో వారు బిజీ అయిపోతారు. రాత్రికి కాస్త తిని నిద్రకుపక్రమిస్తారు. తెల్లారి మళ్లీ మొదలు.. నిరంతరం ఇటువంటి వాతావరణమే కొనసాగుతుంటే పిల్లల్లోనూ, పెద్దల్లోనూ ఒకలాంటి భావన, నిరుత్సాహం ఏర్పడతాయి.

ఎప్పుడూ అదే పని, అవే ఆలోచనలు, అదే ప్రదేశం కాకుండా అప్పుడప్పుడూ మనం భిన్నంగా ఉండాలి. వైవిధ్యంగా ఆలోచించాలి. ఆదివారం అలా సరదాగా పార్కుకో, లేదా ఏదైనా చూడదగిన ప్రదేశానికో వెళ్తే ఇటు పిల్లలకు, అటు పెద్దలకు కొత్త ఉత్సాహం వస్తుంది. మనసుకు హాయిగా, ప్రశాంతంగా ఉంటుంది. ఆ ఉత్సాహం కొన్ని రోజుల వరకూ ఉంటుంది. కొత్త ఆలోచనలకు దారి తీస్తుంది. సృజనాత్మక శక్తి పెరుగుతుంది.

గత ఆదివారం లలిత, రాజు తమ పిల్లలు రజని, రాధికలను తీసుకుని గోల్కొండకు వెళ్లారు. అక్కడ అడుగుపెడుతూనే పిల్లల మొహాల్లో కొత్త ఆనందం. సంతోషంతో గెంతులు వేస్తూ అంతా తిరిగి చూశారు. అందులో అక్కడక్కడా చిన్న చిన్న పార్కుల్లో కాసేపు సేద తీరుతూ రోజంతా ఆడుకున్నారు. గోల్కొండ చారిత్రక విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు వారు ఎప్పుడూ లేనంత ఉత్సాహంగా ఉన్నారు. ఆ సమయంలో వారు భోజనాన్ని కూడా మరిచిపోయారు. తమను అలా బయటికి తీసుకెళ్లినందుకు తల్లిదండ్రులకు తమ సంతోషాన్ని తెలిపారు. ఆ సమయంలో లలిత, రాజు కూడా చాలా సంతోషపడ్డారు. పిల్లలు ఆనందం వ్యక్తం చేసినందుకు వారి మనసుకు చాలా హాయనిపించింది. తమ పిల్లల కళ్లలో ఆ ఆనందాన్ని చూశాక అప్పుడప్పుడూ ఈ విధంగా వారికి నచ్చే ప్రదేశాలకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. వారు కూడా చిన్న పిల్లల్లాగా తమ పిల్లలతో కలిసి ఆడుకున్నారు.

మనసుకు ఆహ్లాదకరమైన ప్రదేశాలను చూడడమే కాకుండా కొత్త కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. వైవిధ్యంగా ఆలోచించడం నేర్చుకోవాలి. ఉద్యోగంలో పై స్థాయికి చేరుకోవడానికి అవసరమైన ఇతర నైపుణ్యాలను నేర్చుకోవాలి. మొదట్లో కాస్త ఇబ్బందిగా ఉన్నా తర్వాత అదే అలవాటౌతుంది.

ఆ విధంగా చేయడం వల్ల కొత్త విషయాలను నేర్చుకోవడానికి అలవాటు పడతారు. కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయి. ఏవైనా ప్రయోగాలు చేయాలనే ఆసక్తి ఏర్పడుతుంది. చేసే కొద్దీ ఉత్సాహం పెరుగుతుంది. పిల్లలకూ ఈ పద్ధతిని అలవాటు చేయడం వల్ల వారి మెదడు వికాసవంతమౌతుంది. వారి మెదళ్లలో వివిధ రకాల ఆలోచనలు చిగురిస్తాయి. దేన్నయినా త్వరగా అర్థం చేసుకోవడానికి అలవాటుపడతారు.

ఇంట్లోనూ ఎవరి పనుల్లో వారు మునిగిపోకుండా అన్ని వత్తిళ్లనూ మరిచిపోయి కాసేపు పిల్లలకు కబుర్లు చెప్పాలి. వారితో కొత్త కొత్త ఆటలు ఆడుకోవాలి. దాగుడు మూతలు, వర్షంలో ఆడడం, కాసేపు ఇంటి గార్డెన్‌లో ఆడడం వంటివి చెయ్యాలి. దాని వల్ల పిల్లలకు, పెద్దలకు అలసట పోయి ఉత్సాహంగా ఉంటారు. రొటీన్‌కు భిన్నంగా ఉండడం వల్ల ఉత్సాహం దరిచేరుతుంది. సృజనాత్మకత అలవడుతుంది.

-మణిదీప్

75వ అంతస్తు

న్యూయార్క్‌లో అదొక ఆకాశహర్మ్యం. జో, సిద్, హ్యారీ అనే ముగ్గురు స్నేహితులు 75వ అంతస్తులో వుంటున్నారు. ఒకనాడు రాత్రిపూట ముగ్గురు కలిసి ఇంటికి వచ్చేసరికి అన్ని లిఫ్టులూ పనిచేయడం లేదని, మర్నాడు మాత్రమే రిపేరు అవుతాయని తెలిసింది. వాళ్ల ఫ్లాట్‌కు వెళ్లాలంటే ఒకే ఒక మార్గం వుంది. అది మెట్లమీదగా ఎక్కి వెళ్లడం.

"అంత పైకి వెళ్లాలంటే చాలా కష్టం. మొదటి 25వ అంతస్తు దాకా నేను పాటలు పాడతా. తర్వాతి 25 అంతస్తుల దాకా సిద్ జోక్స్ చెప్తాడు. చివరి 25 అంతస్తుల దాకా హ్యారీ విషాద గాథలు చెప్తాడు. దాంతో మనం శ్రమ తెలియకుండా పైకి ఎక్కొచ్చు" అన్నాడు జో.

అలా ముగ్గురూ మెట్లు ఎక్కసాగారు. జో పాట తర్వాత పాట పాడాడు. తెలియకుండానే 25వ ఫ్లోర్ వచ్చేసింది. అప్పుడు సిద్ అందుకుని తన స్నేహితులకు రకరకాల జోక్స్ చెప్పి నవ్విస్తూ 50వ ఫ్లోర్ దాకా తీసుకెళ్లాడు.

"ఇప్పుడు నా వంతు. నన్ను నా అత్యంత విషాద గాథతో మొదలు పెట్టనివ్వండి... నేను మన ఇంటి తాళం చెవులు కింది కారులో మరిచిపోయాను" అన్నాడు బాధగా.

-మేకల మదన్‌మోహన్ రావు

అమ్మగారి బస్సు ప్రయాణం

హాయ్ చిన్నారులూ...స్కూళ్లకు సెలవులిచ్చేశారా! మరైతే ఊళ్ల ప్రయాణం పెట్టుకుని వుంటారుగా. ఆ... ఊళ్లకెళ్లినప్పుడు మన చుట్టూ వున్న పరిసరాలను, వాతావరణాన్ని ఎలా గమనించాలో చెప్పే పుస్తకం ఒకటుంది. దాని గురించి చెప్పకుందామా ఇవాళ. ఆ పుస్తకం పేరే తమాషాగా వుంటుంది. ఏంటంటే...'అమ్మగారి బస్సు ప్రయాణం'. ఇంతకీ అమ్మగారు ఎవరనుకుంటున్నారు? ఎనిమిదేళ్ల వల్లియమ్మే. ఆమె తమ వీధిగుమ్మంలో నిల్చుని కొత్త, వింత అనుభవాల్ని చవిచూసేది. ఆమెకు అన్నిట్లోకి వినోదం కలిగించేది పట్నం బస్సు. గంటకి ఓ మారు వీధిగుండా వెళ్లి తిరిగి వస్తుండేది. ప్రతిసారీ కొత్త ప్రయాణికులతో వెళ్లే ఆ బస్సు వల్లికి అంతులేని ఆనందం కలిగించేది. రోజూ అలా బస్సుని చూస్తుంటే, వల్లి చిన్ని బుర్రలో ఓ ఆలోచన వస్తుంది. ఒకసారి బస్సు ప్రయాణం చేయాలని కోరిక కలుగుతుంది. క్రమంగా ఆ కోరిక బలపడుతుంది. వీధి మలుపు స్టాపులో బస్సు నుంచి ప్రయాణికులు దిగినప్పుడల్లా వల్లి ఆశగా వారివంక చూసేది. మనసులో ఆశలు రేగేవి. పట్నానికి బస్సు ప్రయాణం గురించి అక్కడి వింతల గురించి స్నేహితురాళ్లు ఎప్పుడైనా వర్ణిస్తే వల్లి ఈర్ష్య పడేది. అప్పటినుంచి కొన్ని నెలలపాటు బస్సులో రోజూ వెళ్లే ప్రయాణికులు, గ్రామస్థుల మధ్య సంభాషణను వల్లి చాలా శ్రద్ధగా వింటుండేది. ఎలాగైనా పట్నం వెళ్లి రావాలని నిర్ణయించుకుని అందుకు డబ్బు కూడా పోగుచేస్తుంది. తనకు తినుబండారాలు కొనుక్కోమని, సంతలో ఖర్చు చేసుకోమని ఇచ్చిన డబ్బులను అతికష్టమ్మీద పోగుచేసి బస్సు ఎక్కుతుంది. ఆ తర్వాత బస్సు కిటికీలోంచి ప్రపంచాన్ని చూచిన వల్లియమ్మ అనుభవాలేంటో తెలియాలంటే 'అమ్మగారి బస్సు ప్రయాణం' చదవాల్సిందే. ఒకవేళ మీరు కొనుక్కొని చదువుకోలేకపోతే మీ ఊరి లైబ్రరీలో అడిగిచూడండి. హాయిగా చదివేయండి. ఈ వారానికి సెలవా మరి.

అమ్మగారి బస్సు ప్రయాణం, వళ్లికణ్ణన్, పేజీలు-32, ధర-5.50, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా.

- సాహిల్

ఏంటది?

హలో... పైనున్న చిత్రంలో ఎవరు కనిపిస్తున్నారు? పరిశీలనగా చూసి చెప్పండి. ఒక పాప మనతో ఏదో చెప్తున్నట్లుగా వుంది కదూ! ఇంకా అక్కడ ఏదో వుంది. పుస్తకాన్ని కాస్త దగ్గరగా పట్టుకుని చూడండి ఇప్పుడు మీకేం కనిపిస్తుందో చెప్పండి. తెలీకపోతే మా జవాబు చూడండి.

డి. అజయ్
7వ తరగతి,
ఎ.పి.ఎస్.డబ్ల్యు.ఆర్. స్కూల్,
సిర్పూరు,
ఆదిలాబాద్.

ఎన్.అజయ్
5వ తరగతి,
అరకువ్యాలీ,
విశాఖ.

బాలనేస్తాలు

వీరివీరి గుమ్మడి పండు వీరి పేరేమి?

నేస్తాలూ... ఇదిగో ఇక్కడో పిడుగు వున్నాడు. చూశారా! ఇంతకీ తనెవరో తెల్సిందా? తెల్సుకునే పనిలోనే వున్నారా? ఇలా అయితే ఎలా చెప్పండి. ఇలా చూడగానే అలా చెప్పేట్టుండాలి మా చిన్నారులు. సరే! ఇప్పటికేదో ఓకే చేస్తున్నాం. ఈసారి మాత్రం వెంటనే చెప్పేయాలి. పుస్తకం తిప్పి చూడండి. ఎవరో తెలిసిపోతుంది.



చేసేద్దాం

బూర బొమ్మ



హాయ్ పిల్లలూ! బూరలతో రకరకాల బొమ్మలను తయారు చేసుకోవచ్చు కదా! మరి ఇవాళ మనం బెలూన్‌తో టర్కీ బొమ్మను తయారు చేయడం నేర్చుకుందామా! మరి దానికి ఏమేం కావాలో, ఎలా చేయాలో చెప్పుకుందాం.

కావలసిన పదార్థాలు

బూర, కలర్ పేపర్లు, గమ్, కలర్ పెన్సిల్, దారం.

తయారుచేసే పద్ధతి

ముందుగా మీకు నచ్చిన రంగు బూరను తీసుకుని దాని నిండా గాలి ఊదండి. తరువాత దాని మూతిని దారంతో కట్టి దాన్ని టేబుల్ కాలుకో, కుర్చీ కాలుకో కట్టండి. ఇప్పుడు ఒక రంగు పేపర్‌మీద బొమ్మ ఆకారం గీసి దాని ప్రకారం కత్తిరించుకోవాలి. దానికి కన్ను ముక్కు గీయాలి. ఇప్పుడు దాన్ని బూర మీద అంటించండి. తరువాత కలర్ పేపర్లను బొమ్మలో చూపిన విధంగా కత్తిరించుకుని బెలూన్ పైభాగంలో అంటించండి. అంతే టర్కీ బొమ్మ తయారైనట్టే. దాన్ని ఇంట్లో టేబుల్‌మీద గానీ, మనకిష్టమైన చోట గానీ పెట్టుకోవచ్చు. లేదంటే మీ ఫ్రెండ్స్‌కు గిఫ్టుగా కూడా ఇవ్వొచ్చు. మరి టర్కీ బొమ్మను మీరూ తయారు చేస్తారుగా?

రహస్య ఉత్తరం

మ్యాజిక్...

హాయ్ ఫ్రెండ్స్! పరీక్షలయిపోయాయి, వేసవి సెలవులొచ్చాయి. బోరు కొడుతోందా? అయితే ఇవాళ మన ఫ్రెండ్స్‌ను కాసేపు సరదాగా ఆటపట్టిద్దాం. ఎలా అంటారా? రహస్య ఉత్తరం పంపించి. దాని మీద ఏమీ కనిపించకపోయినా, నిజానికి మనం రాసిన విషయం మాత్రం ఉంటుంది. మరి అలా కనిపించకుండా ఉండాలంటే దేంతో రాయాలి, ఎలా చదవాలి అనేది ఒక చిన్న ప్రయోగం ద్వారా తెలుసుకుందాం.

కావలసిన వస్తువులు

సగం నిమ్మకాయ ముక్క,
నీళ్ల, స్పూను,
గిన్నె,
దూది,
తెల్ల కాగితం,
దీపం.

ఎలా చేయాలి?

ముందుగా నిమ్మకాయ రసాన్ని ఒక గిన్నెలో పిండండి. దానిలో నాలుగైదు చుక్కల నీటిని వేసి స్పూనుతో కలపండి. తర్వాత దూదిని తీసుకుని సన్నగా పెన్సిల్ ముక్కులాగా తయారుచేసుకోవాలి. దీన్ని నిమ్మరసంలో ముంచాలి. ఇప్పుడు తెల్లని కాగితం మీద మనం రాయదలచుకున్న విషయాన్ని రాయాలి. దూదిని మధ్యమధ్యలో నిమ్మరసంలో ముంచుతూ ఉండాలి. అది రాసిన కాసేపటికి ఎండిపోయి ఏమీ కనపడదు. ఇప్పుడు ఆ కాగితం మీద రాసిన విషయాన్ని చదవాలంటే దాన్ని కాసేపు దీపం లేదా లైట్ వేడికి ఉంచితే అక్షరాలు కనపడతాయి.

ఏం జరుగుతుంది?

నిమ్మరసం సేంద్రియ పదార్థం కావడం వల్ల దాన్ని వేడి చేసినప్పుడు ఆక్సిజన్‌తో కలిసి బ్రౌన్ కలర్‌లోకి మారుతుంది. నిమ్మరసంలో నీటిని కలిపి రాయడం వల్ల పేపర్ మీద అక్షరాలున్నట్టు తెలుసుకోవడం చాలా కష్టం. దాన్ని వేడిచేసే వరకు దానిమీద ఏముందనేది చదవలేము. నారింజ రసం, తేనె, పాలు, ఉల్లిరసం, వెనిగర్, వైన్ వంటి వాటితో కూడా ఈ రహస్య ఉత్తరం రాసుకోవచ్చు. కొన్ని రసాయనిక చర్యల ద్వారా కూడా కనపడని ఇంకును తయారు చేయొచ్చు. అయితే ఆ ఇంకుతో రాసిన ఉత్తరాన్ని అల్ట్రా వయొలెట్ కిరణాలతో చదవొచ్చు.



నా రాజకీయ జీవితంలో కొన్ని జ్ఞాపకాలు,
రచన: జ్యోతిబసు,
పేజీలు: 120, వెల: 50/-,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్,
1-1-187/1/2, చిక్కడపల్లి,
హైదరాబాద్-20,
ఫోన్: 27608107.

చిన్నపాటి జీవిత చరిత్ర

జ్యోతిబసు రాసిన 'నా రాజకీయ జీవితంలో కొన్ని జ్ఞాపకాలు' చిన్నపాటి జీవిత చరిత్రే. సంక్షిప్తంగా ఆయన జీవితాన్ని, పార్టీ ఎదుర్కొన్న ఒడుదుడుకులు, అందులో బసు నిర్వహించిన పాత్ర, ప్రజలతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఈ చిన్న పుస్తకం మనకు కళ్ళకు కడుతుంది. మహానేతల జీవితాలు మానవాళికి స్ఫూర్తిదాయకం అనడానికి ఆయన జీవితం ఒక తార్కాణం. మార్క్సిజాన్ని ఎంతో శ్రద్ధతో అవగాహన చేసుకొని, దాన్ని దేశంలోనూ, ముఖ్యంగా తమ రాష్ట్రంలో ఆయన అన్వయించిన తీరు చక్కగా అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం తోడ్పడుతుంది. బసు తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నాటి నుంచి తనకు ఎదురైన అనేక అనుభవాలను, అందులో పార్టీ అనుసరించిన ఎత్తుగడలు, వ్యూహాలను ఇందులో చక్కగా పొందుపరిచారు. రైతాంగ పోరాటాల నుంచి కార్మిక వర్గ పోరాటాల వరకూ అన్నింటినీ చక్కగా మన కళ్ళకు కట్టారు. పాఠకుడు అర్థం చేసుకొనేందుకు వీలుగా తన అనుభవాలను ఒక్కో సందర్భాన్ని ఒక్కో ఘట్టంగా మొత్తం చిన్నచిన్న భాగాలుగా వీడదీసి వివరించారు. ఏమాత్రమూ రాజకీయాలతో సంబంధం లేని కుటుంబానికి చెందిన వ్యక్తి కూడా చిత్తశుద్ధితో, సమాజంలోని పీడిత వర్గ ప్రజలతో మమేకమై కృషి చేస్తే అద్భుతమైన విజయాలు సాధించవచ్చని అర్థం చేసుకొనేందుకు బసు జ్ఞాపకాలు చక్కగా తోడ్పడతాయి. చక్కటి సైద్ధాంతిక అవగాహనను, పీడితవర్గాల పట్ల చూపిన ప్రేమను రికార్డు స్థాయిలో పశ్చిమబెంగాల్‌ను పరిపాలించిన కాలంలో ఆచరణ రూపంలో పెట్టారు. ఆయన గొప్ప లౌకికవాది అనడానికి 1992, డిసెంబర్6న బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం రాష్ట్రంలో ప్రశాంతంగా ఉండటమే తార్కాణం. 'ఆ సంఘటన జరిగిన రోజున కలకత్తాలోని రైటర్స్ బిల్డింగ్‌లోని నా కార్యాల యంలో ఒక ముఖ్యమైన సమావేశంలో పాల్గొంటూ ఉండగా బాబ్రీ మసీదును ధ్వంస చేశారన్న వార్త తెలిసింది. నా గుండె ఆగినంత పనయింది. వెంటనే సమావేశాన్ని వాయిదా వేశాను' అని వివరించారు. 1946లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన మత మారణకాండను ఆ అధ్యాయంలో వివరించారు. అప్పుడు హిందువులు ముస్లింలను, ముస్లింలు హిందువులను కాపాడిన తీరును ఆయన గుర్తు చేసుకున్నారు. తరువాతి అధ్యాయాల్లో స్వాతంత్ర్యానంతరం జరిగిన అనేక సంఘటనలు గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన విభేదాలు, అనంతరం జరిగిన పరిణామాలను కూడా చక్కగా వివరిం చారు. అందులో సిపిఎం ఆవిర్భావం జరిగిన తీరును కళ్ళకు కట్టారు. ఒక విధంగా ఈ పుస్తకం బసు జీవిత చరిత్రతోపాటు సిపిఎం చరిత్రను కూడా పాఠకుడు అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నేతల్లో ప్రభుత్వ స్వభావంపై వచ్చిన విభేదాలు, తదితర అంశాలను కూడా ఇందులో పొందుపరిచారు. 1977లో వామపక్ష సంఘటన మూడింట రెండు వంతుల మెజారిటీతో గెలుపొందింది. ఆ సందర్భంగా 'పశ్చిమబెంగాల్ వామపక్ష సంఘటన చరిత్రలో 1977 ఒక వినూత్న మలుపు. రాజకీయ చరిత్ర లో ఒక నూతన దశలో మేము ప్రవేశించామన్న ఉత్సాహం, సంతోషం ఉన్న ప్పటికీ మా గమ్యాన్ని చేరాలంటే ఇంకా ఎంతో దూరం ప్రయాణం చేయవలసి ఉంటుందని నేను గుర్తించాను. మా ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. నూతన బాధ్యతలు స్వీకరించిన రోజున సామాన్య ప్రజల నుంచి ఎన్నటికీ మనం దూరం కారాదని నేను మానసికంగా ప్రతిన తీసుకున్నాను. మా రాజకీయ పోరాటంలో ఏర్పడిన ఆటుపోటులన్నింటా ప్రజలు మమ్మల్ని బలపరి చారు. అలాంటి వారితో సన్నిహిత సంబంధాలను కొనసాగించాలని నేను దృఢంగా నిశ్చయిం చుకున్నాను. మరోసారి ఇంతకు ముందులాగానే ప్రజల కోసం పని చేయాలని నేను ప్రతినబూనాను. రాజకీయ నాయకులను చేయ డానికిగాని, వారిని దిగజార్చడానికిగానీ ప్రజలకే అధికారం, తగిన ఇంగిత జ్ఞానం ఉంది. అలాగే ప్రజలు మాత్రమే దేశాన్ని నిర్మించగలరు. ప్రజలు మాత్రమే చరిత్రను సృష్టించి, దాని రూపురేఖలు దిద్దగలరన్న సత్యాన్ని ఒక్క నిమిషం పాటు కూడా నేను మరచిపోజాలను. ప్రజల్లో విశ్వాసాన్ని నేను ఎన్నడూ కోల్పోలేదు' అని ఆయన చెప్పారు. ఇందులో ఆయన నమ్రత, ప్రజల పట్ల ఉన్న విశ్వాసం మనకు అర్థమౌతుంది. దానికి తగినట్లుగానే ఈ పుస్తకాన్ని దేశ ప్రజలకు అంకితమివ్వడం ద్వారా ప్రజల పట్ల ఉన్న ప్రేమను ఆయన రుజువు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం.

-సింహాద్రి సరోజిని

కొత్త పుస్తకాలు

శ్రీరామానుజ చరితామృతమ్
రచన :
డా॥దాశరథి రంగాచార్య
పేజీలు : 234,
వెల : 120/-,
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్,
విజ్ఞాన భవన్,
హైదరాబాద్-500001.

విశ్వలోచనవం
ఎమ్.ఎల్.కాంతారావు
వెల : 40/-,
ప్రతులకు :
మేళ్లచెరువు లక్ష్మీ కాంతారావు
మొదటి వీధి, ధారావారి తోట,
ఒంగోలు-523001.
ప్రకాశం.
మరియు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
అన్నీ శాఖలు,

శునక మహల్

వావ్! ఈ చిన్న ఇల్లు ఎంత అందంగా ఉందో! చుట్టూ చక్కటి ఫెన్సింగ్, అందులో పచ్చటి గడ్డి, రకరకాల పూల మొక్కలు, ఆడుకోవడానికి ముచ్చటగా ఉంది. ఇది బయటి నుంచే కాదండోయ్ లోపల ఇంకా అందంగా ఉంటుంది. దీనిలో సౌకర్యాలకేమీ తక్కువ లేదు. గట్టి చెక్క నేల, శీతాకాలంలో వెచ్చగా ఉండేందుకు హీటింగ్ పరికరాలు, అలాగే వేసవిలో చల్లగా ఉండేందుకు ఎయిర్ కండిషనర్, ఒక్కొక్కరికీ విడివిడిగా మంచాలు, సీలింగ్ ఫ్యాన్లు, గోడలకు వేళ్లాడే ఖరీదైన వాల్‌పేపర్లు, పెయింటింగులు.. అద్భుతంగా ఉంటుంది. అంతేకాదు చక్కని సంగీతం వినే సౌకర్యం కూడా వుంది. త్వరలోనే చిన్ని ప్లాస్మా టీవీ కూడా తేవాలనుకుంటున్నారు. ఇంతకీ ఆ ఇంట్లో ఎవరుంటారబ్బా అనుకుంటున్నారా?

మీ ఊహకే అందదు. అంత సౌకర్యంగా అక్కడ వుండేది మరెవరో కాదు. ముచ్చటగా మూడు కుక్కలు! "కుక్కల కోసం ఇంత సౌకర్యవంతమైన ఇల్లా!" అని ముక్కున వేలేసుకోకండే. టామి కాసిస్, శ్యామ్ దంపతులు ప్రియాతిప్రియంగా పెంచుకునే చెలసా, డార్లా, కొకొ పఫ్ అనే కుక్కలకోసం చక్కటి ఇల్లు కట్టించాలనుకున్నారు. అది కూడా తాము ఉంటున్న ఇల్లులా ఉండాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా 20,000 డాలర్లు ఖర్చు చేసి లాస్ ఏంజిల్స్ పొలిమేరలో ఈ ఇంటిని నిర్మించారు. 'మా అమ్మ వాటిని తన మనవలు, మనవరాళ్లలా చూస్తుంది. బయటి నుంచి వాటి కోసం అనేక వస్తువులు తెస్తుంది' అని చెప్తోంది కాసిస్. వాటికి యానిమల్ ప్లానెట్ చూడ్డమంటే చాలా ఇష్టమట! అవి నిజంగా ఇంట్లో ఉన్నట్టు ఫీలవుతాయట.

ఇన్ని రాజభోగాలు ఉన్నాక అలా అనుకోవడంలో సందేహమేముంది?

రైతు - నలుగురు దొంగలు

అనుసృజన - **చూటీ**

జరిగినకథ:

ఒక గ్రామంలో నలుగురు దొంగలుంటారు.

వారు ఎప్పుడూ జనాలను మోసం చేసి డబ్బు దండుకుంటుంటారు. వారికి ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకుంటాడు రైతు. అందుకోసం ఓ నాటకం ఆడతాడు. చెట్టుకింద మహిళ బొమ్మ తయారుచేసి, దానికి పిచ్చి నగలు పెట్టి కూర్చోబెడతాడు. ఇదేమీ తెలీని దొంగలు ఆమె నగలు కొట్టేయాలనుకుంటారు. అయితే వారు తాకగానే బొమ్మ పడిపోతుంది. దాంతో వారు తన భార్యను చంపేశారంటూ గోలపెట్టి వారి దగ్గరనుంచి డబ్బు వసూలు చేస్తాడు రైతు. పైగా అప్పుడు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారి చెల్లెల్ని కూడా పెళ్లాడతాడు. చుట్టపుచూపుగా చెల్లెలింటికెళ్లిన వారికి ఒక తమాషా కుందేలు కనిపిస్తుంది. రైతు దగ్గర నుంచి దాన్ని సొంతం చేసుకుంటారు. ఆ తర్వాత....

• • •

కుందేలును పట్టుకుని "ప్రియమైన కుందేలూ! తిన్నగా ఇంటికెళ్లు. చుట్టాలు వస్తున్నారని మా భార్యలకు చెప్పు. వాళ్లు వీరికోసం చక్కటి భోజనం తయారుచేస్తారు" అంటారు. కుందేలు చెంగుచెంగున అడవిలోకి వెళ్లిపోతుంది.

ఆ సాయంత్రం దొంగలు అతిథులతో కలిసి ఇల్లు చేరేసరికి వారి భార్యలు హాయిగా తిని కింద పడుకుని కునుకు తీస్తుంటారు. ఈ దృశ్యాన్ని చూచిన దొంగలకు విపరీతమైన కోపం వస్తుంది. అయితే కొద్దిసేపటికే రైతు తమను మళ్లీ మోసం చేశాడని తెలుసుకుంటారు. కానీ అప్పటికేం చేయలేక ఊరుకుంటారు.

బంధువులకు వున్నదేదో పెట్టి సాగనంపుతారు. కానీ ఎలాగైనా రైతు విషయంలో ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటారు. అంతా కలిసి రైతు ఇంటికి చేరుకుంటారు.

రైతుకు తెల్సు. వాళ్లు వస్తారని. వారికోసం ఎదురుచూస్తుంటాడు. వారు రావడం చూచి భార్య దగ్గరకెళ్లి...

"మీ అన్నలు వస్తున్నారు. వారు ఇక్కడకు వచ్చేసరికి పెద్దగా ఏడుపు లంకించుకో. నిన్ను ఒక గదిలో పెట్టి కొడుతున్నట్టు పెద్దగా కేకలు వేస్తుంటాను. నువ్వు మూర్ఛపోయినట్టు నటించు. ఒక కర్ర పుల్ల తీసుకొని నీ చుట్టూ తిప్పి 'సూంగ్ బతూంగ్, సూంగ్ బతూంగ్' అంటాను. కొద్దిసేపటికి లేచి కూర్చో" అంటాడు.

ఆమె అందుకు ఒప్పుకుంటుంది.

దొంగలు ఇంటికి వచ్చేసరికి రైతు భార్య పెద్దగా ఏడుస్తుంటుంది. అప్పుడు రైతు ఆమెను ఓ గదిలోకి నెట్టి తలుపేసి పరుపుమీద కర్రతో కొట్టడం మొదలెడతాడు. భార్య మరింత పెద్దగా ఏడుస్తుంటుంది. కొద్దిసేపటికి ఏడుపు ఆగిపోతుంది. భార్య మూర్ఛపోయినట్టు నటిస్తుంది.

అప్పుడు రైతు బయటికి వచ్చి

"ఇవాళ మీ చెల్లెల్ని కొట్టాను. ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఇవాళ ఈమె ఏ పనీ చేయలేదు. అలా వుండిపోతుంది. మీరు కావాలంటే ఆమెను వెనక్కి తీసుకెళ్లవచ్చు. లేకపోతే ఆమెను ఏదో ఒకరోజు చచ్చేదాకా కొడతాను" అంటాడు.

దాంతో ఏం చేయాలో తోచదు దొంగలకు. అప్పుడు వాళ్లు "ఇవాళ ఆమె మూర్ఛపోయింది. అదే ఆమె చనిపోతే ఏం చేస్తావు?" అనడుగుతారు.

అప్పుడు రైతు "ఓ... ఆమె తరచుగా స్పృహ కోల్పోతుంది. ఒక్కోసారి చనిపోతుందికూడా. కానీ ఆమెను బతికిస్తుంటాను. కావాలంటే మీ కళ్లముందే చేసి చూపెడతాను" అంటాడు.

"సరే చూపించు" అంటారు దొంగలు ఆశ్చర్యంగా.

నలుగురు దొంగలను గదిలోకి తీసుకెళ్లి ... ఆమె చుట్టూ సన్నటి కర్రతో తిప్పి "సూంగ్ బతూంగ్, సూంగ్ బతూంగ్" అంటాడు. ఇలా రెండు మూడు సార్లు చేసేసరికి రైతు భార్య కళ్లు నలుపుకుంటూ లేచి కూర్చుంటుంది.

ఇదంతా చూచిన దొంగలకు నోట మాట రాదు. పైగా ఈ ధ్యాసలో పడిపోయి వారు కుందేలు సంగతి మర్చిపోతారు.

"ఎలాగోలా ఈ మంత్రదండాన్ని సంపాదించాలి" అనుకుంటారు.

దాన్ని ఇమ్మని రైతును బతిమాలతారు. అయితే వెయ్యి రూపాయలు ఇస్తానంటేనే దాన్ని వారికి ఇవ్వడానికి అంగీకరిస్తాడు.

దొంగలు చాలా సంతోషంగా అందుకు అంగీకరిస్తారు. మంత్రదండంతో ఇల్లు చేరాక తమ భార్యలు మూర్ఛిల్లేలా చేసి తిరిగి మామూలుగా లేపాలనుకుంటారు. ఇరుగుపొరుగు ఎవరైనా చనిపోతే వారిని మంత్రదండంతో తిరిగి బతికించి డబ్బు సంపాదించాలనుకుంటారు.

కొద్దిరోజుల తర్వాత వాళ్ల ఇంటి దగ్గర ఒకరు అనారోగ్యంతో మరణిస్తారు. దొంగలు అక్కడికెళ్లి అతన్ని బతికిస్తామని చెప్తారు. అయితే అందుకు రెండు వేల రూపాయలు ఇవ్వమంటారు. అందుకు ఆ ఇంటివారు సంతోషంగా అంగీకరిస్తారు. డబ్బు పోతేపోయింది చనిపోయినవాడు బతికొస్తే చాలనుకుంటారు.

(ఇంకావుంది)